www.samasamajam.in

# సమ సమాజం

ప్రశ్నించే అక్షరం... ప్రజలకోసం...

తెలుగు దిన పత్రిక

తెలంగాణ | మంగళ వారం, 26 జూలై 2022 | ఎడిటర్ : గోసుకొండ పృధ్విరాజు | సంపుటి - 07, సంచిక-112 | పేజీలు - 4 వెల రూ. 5/-

Published From Hyderabad Circulated by Hyderabad, Rangareddy, Nalgonda, Karimnagar, Warangal, Mahaboobnagar, Kammam, Medak

### అత్యున్నత పీఠంపై ఆదివాసీ మహిళ

# రాష్ట్రపతిగా ప్రమాణాస్వీకారం చేసిన ద్రౌపది ముర్ము

- ముర్ముతో ప్రమాణం చేయించిన సిజెఐ జస్టిస్ న్వీ రమణ
- హాజరైన వెంకయ్యనాయుడు,మోడీ,నడ్డా తదితరులు
- ప్రమాణానికి ముందు రాజ్‌ఘాట్‌లో గాంధీకి నివాళి
- తన ఎన్నిక సామాన్యులకు దక్కిన గౌరవంగా ముర్ము వెల్లడి
- అరుదైన ఘనత దక్కించుకున్న జస్టిస్ ఎన్‌విరమణ





**న్యూఢిల్లీ, జూలై 25 (సమ సమాజం):** దేశ చరిత్రలో సరికొత్త అధ్యాయం ప్రారంభమైంది. రాష్ట్రపతి పీఠంపై తొలి గిరిజన మహిళ ద్రౌపది ముర్ము అత్యతున్నత పీఠం అధిష్టించారు. ఈ క్రమంలో రాష్ట్రపతిగా సోమవారం ఆమె ప్రమాణ స్వీకారం చేశారు. పార్లమెంటు సెంట్రలో హాలులో జరిగిన కార్యక్రమంలో భారత సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ ద్రౌపది ముర్ముతో ప్రమాణం చేయించారు. భారత దేశ 15వ రాష్ట్రపతిగా ద్రౌపది ముర్ము సోమవారం ఉదయం పార్లమెంట్ సెంట్రల్ హాల్‌లో ప్రమాణస్వీకారం చేశారు. సీజేఐ జస్టిస్ ఎన్వీ రమణ ముర్ముతో ప్రమాణం చేయించారు. అనంతరం మాజీ రాష్ట్రపతి రామ్ నాథ్ కోవింద్‌తో పాటు ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, సీజేఐ జస్టిస్ ఎన్వీ రమణ, లోక్ సభ స్పీకర్ ఓంబిర్లా ముర్ముకు శుభాకాంక్షలు తెలిపారు. ముర్ము రెండో మహిళా రాష్ట్రపతి కాగా.. తొలి గిరిజన రాష్ట్రపతి కావడం విశేషం. రాష్ట్రపతి ముర్ము ప్రమాణ స్వీకారోత్సవానికి ప్రధాని నరేంద్రమోడీ, బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా, కేంద్ర మంత్రులు, కాంగ్రెస్ తాత్కాలిక అధ్యక్షురాలు సోనియాగాంధీ, అన్ని పార్టీల ఎంపీలు హాజరయ్యారు. ఒడిశా సీఎం నవీన్ పట్నాయక్, మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్ నాథ్ షిండే తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అంతకు ముందు పార్లమెంటు సెంట్రల్ హాల్‌కు చేరుకున్న ద్రౌపది ముర్ముకు సీజేఐ జస్టిస్ ఎన్వీ రమణ, ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా స్వాగతం పలికారు. అక్కడ సైనిక వందనం స్వీకరించారు. అనంతరం ఆమె తొలి ప్రసంగం చేశారు. తన ఎన్నిక దేశ ప్రజల విశ్వాసానికి ప్రతీకని, బాధ్యతల నిర్వహణకు ప్రజల విశ్వాసం బలాన్నిస్తుందని అన్నారు. దేశ 75 ఏళ్ల స్వాతంత్య్ర ఉత్సవాల సమయంలో..రాష్ట్రపతిగా ఎన్నిక కావడం అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. అందరి విశ్వాసం, సంక్షేమం కోసం పాటుపడదామన్నారు. ఓ సాధారణ ఆదివాసీ అయిన తనను దేశ అత్యున్నత స్థానంలో నిలబెట్టారని అన్నారు. గత రాష్ట్రపతులందరూ ఈ పదవికి వన్నె తెచ్చారని కొనియా

3వ

## ప్రభుత్వంతో గవర్నర్ తమిళసై మరోమారు విమర్శలు

- ప్రోటోకాల్ పాటించడంలో మార్పు రాలేదన్న తమిళసై
- వరదలను రాజకీయం చేయదల్చుకోలేదని వెల్లడి
- ముర్ముకు పదవి మహిళలకు దక్కిన గౌరవం అని వెల్లడి



**న్యూఢిల్లీ, జూలై 25 (సమ సమాజం):** తెలంగాణ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్, టీఆర్ఎస్ ప్రభుత్వం మధ్య కోల్డ్ వార్ కొనసాగుతూనే ఉంది. తాజాగా మరోసారి ఈ విషయం బహిర్గతమైంది. ఢిల్లీ వేదికగా గవర్నర్ తమిళిసై.. తెలంగాణ సర్కార్‌పై పరోక్షంగా విమర్శలు కురిపించారు.తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై గవర్నర్ తమిళిసై మరోసారి ఫైర్ అయ్యారు. ప్రోటోకాల్‌ను పాటించడంలేదని ఆరోపించారు. సోమవారం ఆమె ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ మొట్ట మొదటిసారిగా ఒక గిరిజన మహిళ ద్రౌపది ముర్ము రాష్ట్రపతి అయ్యారని, ఇది దేశం గర్వించదగిన అంశమని అన్నారు. తాను తెలంగాణ ప్రథమ పౌరురాలిగా బాధ్యతతోనే వరద ప్రభావిత ప్రాంతాలకు వెళ్లానన్నారు. ఈ దఫా పర్యటనలో కూడా అధికారులు ప్రోటోకాల్ పాటించలేదని మండిపడ్డారు. ప్రగతి భవన్ ,రాజ్‌భవన్ గ్యాప్‌పై తానిప్పుడేమీ వ్యాఖ్యానించనని అన్నారు. వరదలకు క్లౌడ్‌బస్టర్

2వ

## రాష్ట్రపతి ప్రమాణ కార్యక్రమానికి దూరంగా కెసిఆర్, జగన్

హాజరైన తెలుగురాష్ట్రాల గవర్నర్లు



**న్యూఢిల్లీ, జూలై 25 (సమ సమాజం):** రాష్ట్రపతి ప్రమాణస్వీకారానికి తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు దూరంగా ఉన్నారు. ఆహ్వానం ఉన్నప్పటికీ కెసిఆర్,జగన్‌లో హాజరు కాలేక పోయారు. అయితే ఈ కార్యక్రమానికి ఏపీ, తెలంగాణ గవర్నర్లు బిశ్వభూషణ్ హరిచందన్,తమిళి సై సౌందర రాజన్ హాజరయ్యారు. పార్లమెంట్ సెంట్రల్ హాలులో భారత 15వ రాష్ట్రపతిగా ద్రౌపదీ ముర్ము ప్రమాణ స్వీకారం చేశారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ ద్రౌపదీ ముర్ము చేత ప్రమాణం చేయించారు. దేశంలోని అత్యున్నత రాజ్యాంగ పదవికి ఎన్నికైన తొలి గిరిజన నాయకురాలిగా ద్రౌపది ముర్ము చరిత్ర సృష్టించారు. రాష్ట్రపతిగా బాధ్యతలు చేపట్టిన రెండో మహిళగా నిలిచారు.అంతేకాదు, రాష్ట్రపతి పదవిని అలంకరించిన అతి పిన్న వయసు మహిళగా కూడా రికార్డుల్లోకి చేరారు. అంతకు ముందు ఉదయం ద్రౌపదీ ముర్ము ఢిల్లీలోని రాజ్‌ఘాట్ వద్ద మహాత్మునికి నివాళులర్పించారు. మహాత్మా గాంధీ సమాధి వద్ద పుష్పగుచ్ఛం ఉంచి నమస్కరించారు. రాజఘాట్ నుంచి తన తాత్కాలిక నివాసానికి తిరిగి వెళ్ళి, అక్కడి నుంచి రాష్ట్రపతి భవన్ కు చేరుకున్నారు. అక్కడ రామ్ నాథ్ కోవింద్ దంపతులు ఆమెకు పుష్ప గుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలియజేశారు. రాష్ట్రపతి భవన్ నుంచి పార్లమెంట్ భవనంకు వచ్చిన ద్రౌపది ముర్ము ను ప్రధాని మోడీ, ఉప రాష్ట్రపతి, రాజ్యసభ ఛైర్మన్ ఎం.వెంకయ్య నాయుడు, లోకసభ స్పీకర్ ఓం బిర్లా లు పార్లమెంట్ సెంట్రల్ హాల్ కు తీసుకుని వెళ్లారు.

## సమరయోధుల కలలు సాకారం చేయాలి

సబ్‌కా ప్రయాస్-సబ్‌కా కర్తవ్య్' నినాదంతో ముందుకు : వెంకయ్య



**న్యూఢిల్లీ, జూలై 25 (సమ సమాజం):** స్వాతంత్య సమరయోధుల కలలు సాకారం చేయాల్సి ఉందని ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్య నాయుడు అన్నారు. 'సబ్‌కా ప్రయాస్-సబ్‌కా కర్తవ్య్' నినాదంతో ముందుకు వెళ్లాలని చెప్పారు. అమృత్ మహోత్సవ్ వేళ మరింత వేగవంతంగా పనిచేయాలని చెప్పారు. పార్లమెంటు సెంట్రల్ హాల్‌లో భారత 15వ రాష్ట్రపతిగా ద్రౌపది ముర్ము ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఉపరాష్ట్రపతి వెంకయ్య మాట్లాడుతూ.. అవినీతి నియంత్రణతో దేశం పురోభివృద్ధివైపు పయనిస్తున్నదని చెప్పారు. భారత జవాన్ల శౌర్యానికి నిదర్శనంగా రేపు విజయ్ దివస్ వేడుకలను జరుపుకుంటున్నా మన్నారు. జవాన్లు, దేశ ప్రజలందరికీ విజయ్ దివస్ శుభాకాంక్షలు తెలిపారు. అభివద్ధి నిరంతరం జరగాల్సిన పక్రియ అని చెప్పారు. స్థిరమైన జీవన విధానం చాలా అవసరమని వెల్లడించారు. అటవీ సంపద, నీటి వనరుల ప్రాధాన్యం గుర్తించాలని, ప్రకృతి సంపదను అందరూ కాపాడుకోవాల్సిన అవసరం ఉన్నదని సూచించారు.

## రాష్ట్రపతి భవన్‌లో ముర్ముకు కోవింద్ దంపతుల సాదర స్వాగతం

**న్యూఢిల్లీ, జూలై 25 (సమ సమాజం):** రాష్ట్రపతిగా బాధ్యతలు చేపట్టే ముందు ద్రౌపది ముర్ము తొలుత రాష్ట్రపతి భవన్ కు చేరుకున్నారు. అక్కడ ఆమెకు ప్రస్తుత రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, ఆయన సతీమణి సవితా కోవింద్‌లు పుష్పగుచ్చాలు అందించి సాదర స్వాగతం పలికారు. దేశ ప్రథమ పౌరురాలిగా బాధ్యతలు చేపట్టనున్న ముర్ముకు వారు శుభాకాంక్షలు చెప్పారు. అనంతరం వారు కాసేపు ముచ్చటించారు. ప్రస్తుత రాష్ట్రపతి రామ్ నాథ్ కోవింద్‌తో పాటు కొత్తగా ప్రెసిడెంట్ గా ఎన్నికైన ద్రౌపది ముర్ము దర్బార్ హాలు నుంచి ఫోర్ కోర్టుకు చేరుకున్నారు. అక్కడ ఇరువురు సైనిక గౌరవ వందనం స్వీకరించిన తర్వాత ఒకే కారులో పార్లమెంటు సెంట్రల్ హాలుకు బయలుదేరారు.



## సూర్యాపేటతో సరిసమానంగా మునుగోడు అభివృద్ధి

- టిఆర్ఎస్‌లో చేరిన మండల సాధన కమిటీ కన్వీనర్ కైలాసం
- కాంగ్రెస్ ఆదరణ కోల్పోయిందన్న మంత్రి జగదీశ్వర్ రెడ్డి

**సూర్యాపేట, జూలై 25 (సమ సమాజం):** సూర్యాపేటతో సరిసమానంగా మునుగోడును తీర్చిదిద్దుతామని విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్ రెడ్డి పేర్కొన్నారు. ఇక్కడి శాసన సభ్యుడికి వ్యాపకాలు, వ్యాపారాలు ఎక్కువేనని ఆయన ఎద్దేవాచేశారు. కాంగ్రెస్ పార్టీ సుదీర్ఘ పాలనలో ఇలాంటి నేతల ఎదుగుదలతో సరిసమానంగా ఫ్లోరోసిస్ పెరిగిందన్నారు. కొత్తగా మండలంగా రూపాంతరం చెందిన గట్టుప్పల్ మండల సాధన కమిటీ కన్వీనర్ ఇడెం కైలాసం సోమవారం మంత్రి జగదీష్ రెడ్డి సమక్షంలో టీఆర్ఎస్ చేరారు. మునుగోడు నియోజకవర్గ టీఆర్ఎస్ ఇంచార్జి కుసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ

2వ



## సైకత శిల్పంతో పట్నాయక్ శుభాకాంక్షలు




**న్యూఢిల్లీ, జూలై 25 (సమ సమాజం):** భారత రాష్ట్రపతిగా ఎన్నికైన ఒడిశాకు చెందిన గిరిజన నాయకురాలు ద్రౌపది ముర్ము సోమవారం ప్రమాణ స్వీకారం చేసారు. ఈ నేపథ్యంలో పలువురు నేతలు ఆమెకు అభినందనలు తెలియజేసారు. అందులో భాగంగా పూరీ తీరంలో తనదైన శైలిలో సైకత శిల్పాన్ని రూపొందించడం ద్వారా ప్రఖ్యాత సైకత శిల్పి సుదర్శన్ పట్నాయక్ కృతజ్ఞతతు ప్రకటించారు. ద్రౌపది ముర్ము రాష్ట్రపతిగా ప్రమాణం చేయనుండడంతో.. దేశ చరిత్రలో ఈ రోజును చారిత్రాత్మకమైన రోజుగా అభివర్ణిస్తూ.. ఒడిశాలోని పూరీ బీచ్‌లో ఇసుకతో కూడిన సైకత శిల్పాన్ని రూపొందించాడు. ద్రౌపది ముర్ము ఎన్నికైన రోజున కూడా ఈ సైకత శిల్పి సుదర్శన్ పట్నాయక్.. ఆమెకు శుభాకాంక్షలు తెలియజేస్తూ ఇసుక ఆర్ట్ ను వేశాడు.

## సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- డెంగీ,మలేరియా, టైఫాయిడ్ విజృంభించకుండా చూడాలి
- అధికారులు అప్రమత్తంగా ఉంటూచర్యలు తీసుకోవాలి
- కరోనాకేసులుపెరుగుతున్నాయి..బూస్టర్ వేయించుకోండి
- సీజనల్ వ్యాధులపై మంత్రులతో కలిసి అధికారులతో హరీష్ సమీక్ష



**హైదరాబాద్, జూలై 25 (సమ సమాజం):** వర్షాలు తగ్గినా సీజనల్ వ్యాధులు పెరిగే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని ఆరోగ్య శాఖ అధికారులను మంత్రి హరీశ్‌రావు ఆదేశించారు.భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధులు విజృంభించే ఛాన్స్

3వ

## మంకీపాక్స్ గాలి ద్వారా సోకదు

- పెద్దమ్మ తల్లి లాంటిదే మంకీపాక్స్
- కామారెడ్డి వ్యక్తి నమూనాలు సేకరణ
- పరీక్షల కోసం పూనె వైరాలజీ ల్యాబ్‌కు తరలింపు
- నేడు రోప్టోర్ట్స్ వస్తాయని వెల్లడించిన సూపరింటెండ్

**హైదరాబాద్, జూలై 25 (సమ సమాజం):** తెలంగాణలో మంకీపాక్స్ కలకలం రేపుతోంది. కామారెడ్డిలో ఓ 40 ఏండ్ల వ్యక్తికి మంకీపాక్స్ అనుమానిత లక్షణాలు కనిపించాయి. బాధితుడికి మెడ, గొంతు, చేతి, ఛాతీ మీద పొక్కులు వచ్చాయన్నారు. వెంటనే ఐదు రకాల శాంపిల్స్ తీసి పరీక్షలు నిర్వహించారు.

2వ

## బిజెపిఆదేశిస్తే కెసిఆర్‌పై పోటీ : ఈటెల



**జడ్చర్ల, జూలై 25 (సమ సమాజం):** బీజేపీ అధిష్టానం ఆదేశాలతో సీఎం కేసీఆర్ పై పోటీ చేస్తామని ఎమ్మెల్యే, మాజీమంత్రి ఈటల రాజేందర్ అన్నారు. సోమవారం దేవరకద్ర నియోజకవర్గంలో 'ప్రజా ఘోస-బీజేపీ భరోసా' కార్యక్రమానికి వెళ్తూ.. జడ్చర్లలో ఈటల మీడియాతో మాట్లాడుతూ.. అనేక మంది టీఆర్ఎస్ నేతలు బీజేపీతో టచ్‌లో ఉన్నారని స్పష్టం చేశారు. టీఆర్ఎస్‌ను ఓడించే సత్తా బీజేపీకి మాత్రమే ఉందన్నారు. కోమటిరెడ్డి రాజగోపాలరెడ్డి బీజేపీలో చేరతారనుకుంటున్నానని అభిప్రాయం

2వ

## సంపాదకీయం

# చరిత్ర లిఖించిన భారతప్రజాస్వామ్యం !

భారత ప్రజాస్వామ్యం తలెత్తుకుని నిలిచేలా.... సామాన్యురాలు.. అసామాన్యురాలిగా ఎదిగిన ఓ చరిత్రను భారతదేశం లిఖించుకుంది. ప్రజాస్వామ్యంలో సామాన్యులూ అసామాన్యులుగా మారుతారనడానికి ఇంతకన్నా నిదర్శనం అక్కర్లేదు. ఎక్కడో మారుమూల ఒడిషాలోలోని ఓ గిరిజన గ్రామంలో పుట్టిన ఓ సామాన్య గిరిజన మహిళ అత్యున్నత రాష్ట్రపతి పీఠం అధిష్టించారు. ఆజాదీకా అమృతోత్సవం జరుపుకుంటున్న వేళ ఈ ఘనట జరగడం కాకతాళీయమే అయినా భారత ప్రజాస్వామ్య పరిమళాలను చాటింది. ఈ దేశంలో మాత్రమే అత్యున్నత పీఠాలను సామాన్యులు అధిష్టించగలరని నిరూపించారు. మనదేశ ప్రజాస్తామ్యం గురించి చులకనగా మాట్లాడే వారికి ఇదో చెంపపెట్టు. ప్రతిభ ఉంటే కులమతాలకు అతీతంగా అత్యున్నత పీఠంపై ఎవరైనా అదిష్టగలరని మరోమారు రుజువయ్యింది. ఇంతకు మునుపు ఉన్న రామ్‌నాథ్ కోవింద్ కూడా సామాన్య దళిత కుటుంబం నుంచి వచ్చిన వారే. ఇంతవరకు ఉన్న రాష్ట్రపతు లతో పోలిస్తే ద్రౌపది ముర్ము మరింత ప్రత్యేకత సంతరించుకున్నారు. ఓ సామాన్య గిరిజన మహిళగా ప్రస్థానం మొదలైన ఆమె జీవితం అంచెలంచెలుగా ఎదిగిన తీరు మనం గమనించాలి. అందుకే ఆదివాసీ మహిళగా ముర్ము అద్భుతం సృష్టించారు. భారత ప్రథమ పౌరురాలిగా రాష్ట్రపతి పీఠాన్ని అధిరోహించిన తొలి గిరిజన మహిళగా చరిత్ర సృష్టించారు. భారత 15వ రాష్ట్రపతిగా ఆదివాసీ మహిళ ద్రౌపది ముర్ము ఉన్నత స్థానంపై అధిష్టించిన వేళ మనమంతా గర్వపడాలి. అడవిలో పుట్టి అత్యున్నత పదవికి ఎంపికైన తొలి ఆదివాసీ మహిళగా ద్రౌపది ముర్ము కొత్త చరిత్ర లిఖించారు. గతంలో ప్రతిభా పాటిల్ తొలి మహిళా రాష్ట్రపతిగా రికార్డు సృష్టించగా.. ఇప్పుడు ముర్ము తొలి ఆదివాసీ మహిళా రాష్ట్రపతిగా ఎన్నికై సరికొత్త అధ్యాయానికి తెర తీశారు. 2007 నుంచి 2012 వరు ప్రతిభా పాటిల్ మొదటి మహిళా రాష్ట్రపతిగా సేవలందించగా.. అత్యున్నత పదవి అధిరోహించిన ద్రౌపది ముర్ము 2027 వరకు పదవిలో కొనసాగనున్నారు.ఇదే సందర్భం లో దేశ ఆజాదీకా అమృత్ మహోత్సవాలు జరుపుకోవడం విశేషం. అయితే కేవలం ముర్మును రాష్ట్రపతిని చేసిన ఘనత బిజెపిదే అయినా.. ఇప్పుడు మరింత బాధ్యతతో వ్యవహరించాల్సి ఉంది. దేశంలో ఆదివాసీలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలి. ఆదివాసీల భూసమస్యను పరిష్కరిం చాలి. అడవితో వారికున్నఅనుబంధాన్ని తెంపేందుకు చేస్తున్నప్రయత్నాలను అడ్డుకోవాలి. విద్యైవద్యానికి వారిని చేరువ చేయాలి. గిరిజనల సంక్షేమంకోసం పత్యేక కార్యాచరణ చేయాలి. తాము గిరిజనుల అభివృద్దికి కట్టుబడి ఉన్నామనినిరూపించాలి. నిన్న మొన్నటి వరు కనీసం కరెంటు కూడా లేని కుగ్రామంలో పుట్టిన ద్రౌపది ముర్ము.. ఇప్పుడు దేశ అత్యున్నత పదవి చేపట్టినందుకు కానుకగా తమకు ఈ సమస్యలు పరిష్కారం అయ్యాన్న భరోసా వారిలో నింపాలి. దేశానికి స్వాతంత్య్రం వచ్చిన 11 సంవత్సరాల తరువాత అంటే 1958 జూన్ 20వ తేదీన ఒడిశాలోని మయూర్ భంజ్ జిల్లాలోని బైదాపోసి గ్రామంలో ద్రౌపది ముర్ము జన్మించారు. ఆమె తండ్రి బిరంచి నారాయణ్ తుడు. ఆయన సంతాల్ ఆదివాసితెగకు చెందినవారు. ఈ తెగ వందల ఏళ్లుగా మనదేశంలో ఉన్నట్టు చరిత్ర చెబుతోంది.అంతేకాదు.. సంతాల్ తెగ వీరులను భారతదేశ మొదటి స్వాతంత్య్ర పోరాట యోధులుగా కూడా పిలుస్తారు. అలాంటి తెగ నుంచి వచ్చిన ద్రౌపది ముర్ము ఇప్పుడు దేశ రాష్ట్రపతి అయ్యారు. ద్రౌపది ముర్ము భర్త పేరు శ్యామ్ చరణ్ ముర్ము. ముర్ము దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. అయితే భర్తతో పాటు, ఇద్దరు కుమారులను కోల్పోవడ ఆమె జీవితంలో విషాదం. టీచర్ గా జీవితం మొదలుపెట్టిన ద్రౌపది ముర్ము... తర్వాత బీజేపీలో చేరి వివాదాలు లేని నాయకురాలిగా గుర్తింపు పొందారు. ఇంతకన్నా గొప్ప విషయం మరోటి ఉండదు. అదే ఆమెను అత్యున్నత స్థాయికి చేర్చింది. ఇవాళ సగౌరవంగా ఆమె భారత రాష్ట్రపతిగా అధ్యక్షస్థానం స్వీకరించారు.భారతీయ జనతాపార్టీ కేవలం ఓట్ల కోసమే ఆదివాసీ మహిళకు అత్యున్నత రాష్ట్రపతి గౌరవం ఇస్తున్నదన్న విమర్శలు ఎలా ఉన్నా.. ఆ ప్రయత్నం చేసినందుకు బిజెపిని అభినందిం చాల్సిందే. దళిత ముఖ్యమంత్రి ప్రతిపాదన చేసిన కెసిఆర్ కూడా ఇలాంటి ఆలోచన చేయ లేదు. విపక్షాలు ఇలాంటి ఆలోచన చేయలేదు. వారు ఎంతసేపు బిజెపికి వ్యతిరేకంగా ఓ అభ్యర్థిని నిలబెడ దామనుకున్నారే తప్ప మరోటి కాదు. ఓట్ల కోసమే బిజెపి ఎస్టీ అభ్యర్థిని నిలబెట్టారని విమర్శలు వినిపిం చాయి. అయినా ముర్ము ఎంపికలో తప్పుపట్టవలసింది ఏమీ లేదు. వివిధ సామాజిక శ్రేణులు తమ ప్రాబల్యం పెంచుకోవడానికే వీలుగా వారికి రాజకీయాల్లో, అధికారంలో ప్రాతినిధ్యాన్ని, భాగస్వామ్యాన్ని కల్పించాల్సిందే. అప్పుడే వారికి ఈ దేశ ప్రజాస్వామ్యంపైనా,వ్యవస్థలపైనా నమ్మకం కలుగుతుంది. ఎల్లవేళలా ఒకటి రెండు వర్గాలు మాత్రమే అధికారానికి చేరువ కావడం కూడా సరికాదు. ఆదివాసులను సమీకృతం చేయడానికి వారు దశాబ్దాలుగా చేస్తున్న ప్రయత్నంలో ఇది కూడా ఒక భాగం. గిరిజనులను అత్యున్నత స్థానంలో ప్రతిష్ఠించడం ద్వారా వారిలో గూడుకట్టుకుని ఉన్న అభద్రతను తొలగించుకోవచ్చు. ఓట్ల కోసం ఆయా శ్రేణులను ఆకట్టు కోవడానికి గత నాలుగు దశాబ్దాల నుంచి పాలకపక్షాలు ప్రయత్నిస్తూనే ఉన్నాయి. వారంతా ఈ దేశ ప్రజలే అని, ఈ మట్టి మనుషులే అని గుర్తించాలి. దూరదృష్టితో ఇందిరాగాంధీ జ్ఞానీ జైల్‌సింగ్‌ను రాష్ట్రపతి చేశారు. శాస్త్రవేత్త అబ్దుల్ కలామ్ రాష్ట్రపతి అయ్యారు. మన రాజ్యాంగంలో రాష్ట్రపతులు క్రియాశీలంగా ఉండడానికి, తమ విచక్షణలను ఉపయోగించే అవకాశం పెద్దగా రాదు. అలాగే బలమైన ప్రభుత్వాలు ఉన్న సందర్భాలలో వారు చేయగలిగేది ఏమీ ఉండదు. ఆదివాసీలు తమ మనుగడకే ముప్పు వచ్చిందంటూ ఆందోళను చేస్తున్నారు. పోడు భూముల కోసం పోరాడుతున్నారు. ఈ సమయంలో కూడా ఈ దేశ వనరులను కాపాడడానికి ప్రయత్నిస్తున్నారు. గొంతెత్తినందుకు నిర్బంధంలో పడుతున్నారు. ఈ క్రమంలో అన్ని వర్గాలకు న్యాయం చేయగలగాలి. అన్ని వర్గాలను విశ్వాసంలోకి తీసుకోవాలి. అప్పుడే మన ప్రజాస్వామ్యం బలపడగలదు. అందుకుముర్ము ఎంపికే ఓ మంచి నిదర్శనం. ఆమె అత్యున్నత పీఠంపై నిలిచినిందుకుమనమంతా గర్వించాలి. మనదేశ ప్రజాస్వామ్యం సమున్నతమైనదని తలెత్తుకుని సెల్యూట్ చేయాలి.

పృధ్విరాజ్ గోసుకొండ
ఎడిటర్

# విద్యావ్యవస్థ బలోపేతానికి కృషి చేసిన ముర్ము

**గవర్నర్‌గా సమస్యలపై ప్రత్యేక దృష్టితో కృషి ● ఇప్పుడు రాష్ట్రపతిగా మరింతగా సమస్యలపై దృష్టి**



**న్యూఢిల్లీ, జూలై 25 (సమ సమాజం):** ద్రౌపది ముర్ము గవర్నర్ గా ఉన్నప్పుడు విద్యావ్యవస్థ బలోపేతానికి ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. స్కూళ్లు, కాలేజీల పరిస్థితులపై ఎప్పటికప్పుడు సమీక్షలు చేసేవారు. 2016లో యూనివర్శిటీల కోసం లోక్ అదాలత్ నిర్వహించారు. తీవ్ర వ్యతిరేకత వచ్చినా ఛాన్స్ లర్ పోర్టల్ ప్రారంభించారు. యూనివర్శిటీలకు సంబంధించిన అన్ని పక్రియలను దీనికి అనుసంధానించారు. యూనివర్శిటీల వైస్ ఛాన్సలర్లతో చర్చిస్తూ.. గిరిజన భాషల అధ్యయనానికి సంబంధించిన సూచనలు చేశారు. యూనివర్శిటీల్లో చాలా కాలంగా మూతపడిన గిరిజన, ప్రాంతీయ భాషల ఉపాధ్యాయుల నియామకం గవర్నర్ చర్యల ఫలితంగా మళ్లీ మొదలైంది. ఈ క్రమంలో ఆమె రాష్ట్రపతిగా గిరిజన సమస్యలపై చర్యలు తీసుకునే ప్రభుత్వాలపై ఒత్తిడి తెచ్చే అవకాశాలున్నాయి. రాష్ట్రపతి భవన్‌లో ఇకపేదలకు ప్రవేశ్ కలగాలి. సమస్యలపై చర్చించే అవకాశం ఇవ్వాలి. దేశంలోని హరిజన,గిరిజన వర్గాల సమస్యల పరిష్కారం కోసం వేదికకావాలి. ఆమె అందుకు సిద్దంగా ఉంటారని అశించవచ్చు. ద్రౌపది ముర్ము..క్లర్క్ గా కెరీర్ ప్రారంభించి ఆ తర్వాత రాజకీయాల్లోకి వచ్చారు. అయితే.. ఎక్కడ పని చేసినా ఆ పదవికి గౌరవం తీసుకొచ్చారని ఆమె గురించి తెలిసిన వాళ్లు గొప్పగా చెబుతుంటారు. ప్రభుత్వ ఉద్యోగిగా, ప్రజా ప్రతినిధిగా.. అన్ని చోట్లా ముర్ము ప్రజల సంక్షమమే లక్ష్యంగా పని చేశారని అంటుంటారు. తర్వాత గవర్నర్ పదవిలో ఉన్నా... రాజకీయ ఒత్తిళ్లను పట్టించు కోకుండా.. తన, పర అనే బేధాలు లేకుండా పార్టీలకు అతీతంగా పదవికి వన్నె తెచ్చారు. ఇప్పుడు రాష్ట్రపతి పదవికి ఆమె ఖచ్చితంగా మరింత గౌరవం తీసుకొస్తారని ఆమె గురించి తెలిసిన వారు ఆశిస్తున్నారు. ద్రౌపది ముర్ము 1979లో భువనేశ్వర్ లోని రమాదేవి విమెన్స్ కాలేజీ నుంచి బీఏ పాస్ అయ్యారు. ఆ తర్వాత ఒడిశా ప్రభుత్వంలో క్లర్క్ గా తన వృత్తి జీవితాన్ని ప్రారంభించారు. నీటిపారుదల, ఇంధన శాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేశారు. తరువాతి కాలంలో తనకున్న ఆసక్తితో ఆమె టీచర్ అయ్యారు. రాయరంగ్ పూర్ లోని శ్రీ అరబిందో ఇంటిగ్రల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ సెంటర్ లో గౌరవ ఉపాధ్యాయురాలిగా పని చేశారు. 1997లో ద్రౌపది ముర్ము తన పొలిటికల్ కెరీర్ ని మొదలుపెట్టారు. మొదట రాయరంగ్ పూర్ నగర పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసి కౌన్సిలర్ గా గెలుపొందారు. నగర పంచాయతీ ఉపాధ్యక్షురాలిగా కూడా ఉన్నారు. ఆ తర్వాత రాయరంగ్ పూర్ అసెంబ్లీ స్థానం నుంచి 2000, 2009 ఎన్నికల్లో బీజేపీ ఎమ్మెల్యేగా గెలిచారు. మొదటిసారి ఎమ్మెల్యే అయినప్పుడు 2000 నుంచి 2004 వరకు నవీన్ పట్నాయక్ నేతృత్వంలోని బీజేడీ, -బీజేపీ సంకీర్ణ ప్రభుత్వంలో వాణిజ్యం, రవాణా, మత్స్య, జంతు వనరుల శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు. మంత్రిగా ఉండి కూడా ఆమె నిరాడంబర జీవితాన్ని గడిపారు. ఆమెకు సొంత వాహనం కూడా లేదు. అందుకే ఒడిశాలోని ఉత్తమ ఎమ్మెల్యేలకు అందించే నీలకంఠ అవార్డును ముర్ము అందుకున్నారు.రెండుసార్లు బీజేపీ ఎస్టీ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యురాలిగా ముర్ము వ్యవహరించారు. 2002 నుంచి 2009 వరకు, 2013 నుంచి 2015 ఏప్రిల్ వరకు ఎస్టీ మోర్చా జాతీయ కార్యవర్గంలోనూ సభ్యురాలిగా ఉన్నారు. ఆ తర్వాత ముర్మును జార్ఖండ్ గవర్నర్ గా నామినేట్ చేశారు. దీంతో క్రియాశీలక రాజకీయాలకు దూరమయ్యారు. 2015 మే 18న ఝార్ఖండ్‌కు తొలి మహిళ, గిరిజన గవర్నర్ గా ద్రౌపది ముర్ము ప్రమాణస్వీకారం చేశారు. ఐదేళ్ల పదవీ కాలం ముగిశాక కూడా ఆమె అక్కడ గవర్నర్‌గా కొనసాగారు. గవర్నర్ గా బాధ్యతలు తీసుకున్నాక కూడా వివాదరహితురాలిగానే ముర్ము కొనసాగారు. ప్రజా సంక్షేమమే ఎజెండాగా ముందుకు కదిలారు. గతంలో ఆమె బీజేపీ నేతగా ఉన్నా.. జార్ఖండ్ గవర్నర్ గా ఉన్నప్పుడు బీజేపీ సర్కారు తెచ్చిన బిల్లుల్లో కొన్నింటిని వెనక్కి పంపారు. ఆదివాసీల భూములను కాపాడేందుకు బ్రిటిష్ పాలనలో తీసుకొచ్చిన చోటానాగ్ పూర్ కౌలుదారీ చట్టం, సంతాల్ పరగణా కౌలు చట్టంలోని కొన్ని నిబంధనలను సవరించాలని 2017లో అప్పటి రఘువర్ దాస్ ప్రభుత్వం ప్రతిపాదించింది. ప్రతిపక్షాలు వ్యతిరేకించినా.. అసెంబ్లీలో ఆమోదం పొందింది. అయితే ఆమోదం కోసం రాజ్ భవన్ కు వెళ్లిన తర్వాత గవర్నర్ గా ఉన్న ద్రౌపది ముర్ము ఈ బిల్లుపై సంతకం చేయకుండా వెనక్కు పంపారు. దీనివల్ల ఆదివాసీలకు ఏం లాభమని ప్రశ్నించారు. అందుకు రాష్ట్ర ప్రభుత్వం సరైన జవాబు చెప్పలేకపోయింది. దాంతో ఆ బిల్లు ముందుకు సాగలేదు. దీనిపై విమర్శలు వచ్చినా ముర్ము వెనక్కి తగ్గలేదు. సవరణ బిల్లుపై 200 అభ్యంతరాలు ఉన్నాయని చెప్పారు. వాటిపై క్లారిటీ ఇవ్వాలని జార్ఖండ్ ప్రభుత్వానికి చెప్పారు. ఢిల్లీ స్థాయిలో ఒత్తిళ్లు వచ్చినా ఈ బిల్లు విషయంలో ఆమె వెనకడుగు వేయలేదు. తాను తీసుకున్న నిర్ణయానికే కట్టుబడి ఉన్నారు. తర్వాత మరో అంశంలోనూ ఇదే విధంగా జరిగింది. రఘువర్ దాస్ ప్రభుత్వం హయాంలో పాతాళగడి వివాదం చెలరేగింది. అప్పుడు, ద్రౌపది ముర్ము ఆదివాసి గ్రామపెద్దలను, మాంకి, ముండాలను రాజ్ భవన్ కు పిలిపించి, వారితో మాట్లాడి సమస్యను పరిష్కరించేందుకు ప్రయత్నించారు. 2019 డిసెంబర్‌లో రఘువర్ దాస్ ప్రభుత్వం కూలిపోయి జేఎంఎం నాయకుడు హేమంత్ సోరెన్ ఝార్ఖండ్ ముఖ్యమంత్రి అయ్యారు. కొన్ని నెలలకు హేమంత్ సోరెన్ ప్రభుత్వం ట్రైబల్ కన్సల్టేటివ్ కమిటీ (టీఏసీ ) ఏర్పాటుకు సంబంధించిన సవరణ బిల్లును గవర్నర్ ఆమోదం కోసం పంపింది. ఈ సవరణ ప్రకారం టీఏసీ ఏర్పాటులో గవర్నర్ పాత్ర ఉండదు. అయితే.. ద్రౌపది ముర్ము దానిపై సంతకం చేయకుండా ప్రభుత్వానికి తిరిగి పంపారు.

# 25ననే ప్రమాణ స్వీకారం రాజ్యాంగలో లేదు

**గత రాష్ట్రపతుల పదవీకాలం ముగిసిన క్రమంలో అమలు**

**నీలం సంజీవరెడ్డి నుంచి 45 ఏళ్లుగా ఇదే విధానం**

**న్యూఢిల్లీ, జూలై 25 (సమ సమాజం):** వాస్తవానికి జూలై 25 నే భారత రాష్ట్రపతి ప్రమాణ స్వీకారం చేయాలని రాజ్యాంగంలో ఎక్కడా పొందుపర్చలేదు. అలాగని ఇదేం నియమం కూడా కాదు. కానీ పదవీకాలం పూర్తయిన గత రాష్ట్రపతుల తేదీ ఆధారంగా దాదాపు 45 ఏళ్లుగా ఇదే విధానం కొనసాగుతోంది. రామ్‌నాథ్ కోవింద్ పదవీకాలం 24నే ముగియడంతో 25న ముర్ము ప్రమాణం చేశారు. నీలం సంజీవరెడ్డి నుంచి ఇదే సంప్రదాయం కొనసాగుతోంది.అందుకే భారత 15వ రాష్ట్రపతిగా ద్రౌపది ముర్ము ప్రమాణ స్వీకారం చేశారు. సీజేఐ జస్టిస్ ఎన్వీ రమణ.. ముర్ముతో ప్రమాణం చేయించారు. పార్లమెంట్ సెంట్రల్ హాల్‌లో జరిగే ఈ వేడుకకు మాజీ రాష్ట్రపతి రామ్ నాథ్ కోవింద్, ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, ప్రధాని నరేంద్రమోదీ, స్పీకర్ ఓంబిర్లా, కేంద్రమంత్రులు, ఎంపీలు, గవర్నర్లు, సీఎంలు, త్రివిధ దళాల అధికారులు హాజరయ్యారు. నూతన రాష్ట్రపతిగా ఒడిశాకు చెందిన ద్రౌపది ముర్ము జూలై 25న ప్రమాణ స్వీకారం చేశారు. అయితే ముర్ముతో పాటు..ఇప్పటి వరకు మరో తొమ్మిది మంది రాష్ట్రపతులు జులై 25నే ప్రమాణం స్వీకారం చేయడం విశేషం. 1977 నుంచి ఇప్పటి వరకూ రాష్ట్రపతులుగా ఎన్నికైన వారంతా జూలై 25నే ప్రమాణ స్వీకారం చేశారు. భారత మొట్టమొదటి రాష్ట్రపతి డాక్టర్ బాబు రాజేంద్రప్రసాద్ దేశ తొలి రాష్ట్రపతిగా 1950 జనవరి 26న ప్రమాణం చేశారు. ఆ తర్వాత ఆయన రెండు సార్లు ఎన్నికయ్యారు. అనంతరం 1962లో సర్వేపల్లి రాధాకృష్ణన్ రాష్ట్రపతి పదవిని చేపట్టారు. సర్వేపల్లి తర్వాత డా. జాకీర్ హుస్సేన్, వీవీ గిరి, ఫక్రుద్దీన్ అలీ అహ్మద్‌లు రాష్ట్రపతిగా బాధ్యతలు స్వీకరించినా..పూర్తి కాలంలో పదవిలో ఉండలేదు. వీరి తర్వాత 1977లో నీలం సంజీవరెడ్డి జులై 25న రాష్ట్రపతిగా పదవీ బాధ్యతలు స్వీకరిచారు. ఆయన రాష్ట్రపతిగా ఐదేళ్లు కొనసాగారు. ఆ తర్వాత రాష్ట్రపతులుగా మారిన ప్రతీ ఒక్కరూ విజయవంతంగా ఐదేళ్లపాటు పదవిలో ఉన్నారు. దీంతో అప్పటి నుంచి జులై 25న బాధ్యతలు స్వీకరించడం.. ఐదేళ్ల తర్వాత జులై 24న పదవీ విమరణ చేయడం ఆనవాయితీగా వస్తోంది. జ్ఞానీ జైల్ సింగ్, వెంకట్రామన్, శంకర్ దయాళ్ శర్మ, కేఆర్ నారాయణన్, అబ్దుల్ కలాం, ప్రతిభా పాటిల్, ప్రణబ్ ముఖర్జీ, రామ్‌నాథ్ కోవింద్ కూడా జులై 25నే ప్రమాణ స్వీకారం చేశారు. దీంతో పదవీకాలం దృష్ట్యా ఇదే విధానం కొనసాగుతోంది.

# సూర్యాపేటతో సరిసమానంగా మునుగోడు అభివృద్ధి

(మొదటి పేజి తరువాయి) కార్యక్రమంలో చండూరు జెట్పీటీసీ కర్నాటి వేంకటేశం తదితరులు పాల్గొన్నారు. అనంతరం మంత్రి జగదీష్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రజల్లో ఆదరణ కొల్పయిందన్నారు. మోసకారి పార్టీగా ప్రజల్లో ఆ పార్టీకి గుర్తింపు వచ్చిందన్నారు. ప్రధాని మోదీ పన్నుల ప్రధానిగా ఘనత కెక్కారని ఆయన ఎద్దేవాచేశారు. అందుకే యావత్ తెలంగాణా సమాజం ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలోని టీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నారన్నారు. గట్టుప్పల్ మండల ఏర్పాటు ప్రజల కల అని,ఆ కలను సాకారం చేసిన నేత ముఖ్యమంత్రి కేసీఆర్ అని ఆయన కొనియాడారు. కాంగ్రెస్ పార్టీ నేతల తో పాటు పెరిగి మునుగోడు ను కబళించిన ఎలోరోసిస్ ను నివారించింది కుడా ముఖ్యమంత్రి కేసీఆర్ అని ఆయన పేర్కొన్నారు. జాతీయ,అంతర్జాతీయ సంస్థలు నిర్వహించిన సర్వేలలో ఎలోరోసిస్ కేసు నమోదు కాలేదు అంటే అది ముమ్మాటికీ సీఎం కేసీఆర్ గొప్పతనమేనన్నారు. దాంతో ప్రజల్లో పెరిగిన విశ్వసనీయతకు టీఆర్ఎస్ చేరేందుకు బారులు తీరుతున్న ఉదంతాలే నిదర్శనమన్నారు.

# పాల్వాయి స్రవంతి ఆగమనం

- టీపిసిసి రేవంత్‌తో పాల్వాయి స్రవంతి సంప్రదింపులు
- కాంగ్రెస్ హైకమాండ్ ఆదేశిస్తే మునుగోడు బరిలోకి
- ఇనాళ్లు మునుగోడు కాంగ్రెస్‌లో గ్రూప్ తగాదాల కారణంగా దూరం
- మునుగోడు ప్రజలకు అవసరమైనప్పుడల్లా అధికారులతో మాట్లాడి వారి సమస్యను పరిష్కరిస్తున్నా : కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు పాల్వాయి స్రవంతి

**హైదరాబాద్, జూలై 25 (సమ సమాజం):** మునుగోడు ప్రజలు కోరుకుంటే ఉపఎన్నికకు సిద్ధమంటున్న కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సంచలన వాక్యల నేపధ్యంలో మునుగోడు నియోజకవర్గ రాజకీయాలు హీటెక్కిస్తున్నాయి. ప్రజలు కోరుకున్నట్లు ఉపఎన్నిక జరిగితే ఉపఎన్నిక బరిలో పాల్వాయి స్రవంతి కాంగ్రెస్ పార్టీ తరఫున హైకమాండ్ అదేశిస్తే నిలబడేందుకు సిద్ధంగా ఉన్నానని తెలిపారు. ఈ సందర్భంగా స్రవంతి మాట్లాడుతూ కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి పార్టీ మార్పు సంకేతాలతో పాల్వాయి శ్రావంతితో టి.పిసిసి రేవంత్‌రెడ్డి మునుగోడు క్షేత్రస్థాయి పరిశీలనలో భాగంగా ఉపఎన్నిక సంభవిస్తే సాధ్య అసాధ్యాలపై చర్చించినారని తెలిపారు. ఉపఎన్నిక అనివార్యమైతే మునుగోడు బరిలో నిలబడేందుకు సిద్ధంగా ఉంటానని చెప్పినట్లు తెలిపారు. ఇన్నాళు మునుగోడు నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీలో గ్రూప్ తగాదాలు ఉత్పన్నమౌతున్నాయని అందుకే దూరంగా ఉండాల్సి వచ్చిందని, ప్రజలకు అవసరమైనప్పుడల్లా అధికారుల తో మాట్లాడి వారి సమస్యలను పరిష్కరిస్తూ వస్తున్నానని అన్నారు. దివంగత నేత పాల్వాయి గోవర్ధన్‌రెడ్డి కాలం నుంచి కూడా మేము చేసిన మంచి పనులను డబ్బా కొట్టుకోవడం అలవాటు లేదని అన్నారు. సుధీర్ఘ కాలంగా దాదాపు 30 ఏండ్లుగా మునుగోడు నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ కీలక నేతగా పని చేస్తున్నానని, ఒకసారి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీచేసి ముప్పై వేల ఓట్లకు పైచిలుకు ఓట్లు వచ్చాయని, నన్ను ఆదరించే కార్యకర్తలు మునుగోడు నియోజకవర్గంలో ఉన్నారని, మాకు యూత్ ఫాలోయింగ్‌తోపాటు మాకు వెన్ను దన్నుగా ప్రజల ఆదరఅభిమానాలు ఉన్నాయని అన్నారు. అదిష్టానం ఆదేశిస్తే ప్రజల్లోకి వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నానని అన్నారు.



**మునుగోడు ఉపఎన్నిక బరిలో కాంగ్రెస్ అభ్యర్థిగా పున్నకైలాష్ నేత !**

ప్రజాస్వామ్యంలో ఎవ్వరైనా పోటీకి సిద్ధం కావొచ్చని, పార్టీకి మంచి చేస్తానన్నవారికి అదిష్టానం అవకాశం ఇస్తుంది అని అన్నారు. పున్నకైలాష్ టి.కాంగ్రెస్ అధికార ప్రతినిధిగా చురుకుగా తన పని తాను చేసుకుంటూ పోతున్నాడని అభిప్రాయం వ్యక్తం చేశారు. త్వరలో ప్రజల్లోకి వెళ్లేందుకు సిద్దమౌతున్నానని పాల్వాయి స్రవంతి తెలిపారు.

# ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డిపై కాంగ్రెస్ సీరియస్

**ఆయన వ్యాఖ్యలపై ఆరా తీస్తున్న మాణిగం ఠాకూర్**



**న్యూఢిల్లీ, జూలై 25 (సమ సమాజం):** ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి వ్యవహారంపై కాంగ్రెస్ అధిష్టానం ఆరా తీస్తోంది. కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జ్ మాణిక్కం ఠాగూర్ రంగంలోకి దిగారు. నిన్న తన నివాసంలో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో కోమటిరెడ్డి మాట్లాడిన అంశాలను అధిష్టానం క్లిప్పింగ్స్ తీసుకుంది. రాజగోపాల్ రెడ్డి గతంలో కూడా పార్టీ విషయంలో చేసిన కామెంట్స్, ఇచ్చిన వివరణలను ఠాగూర్ తెప్పించుకున్నారు. గతంలో ఆర్సీ కుంతియా, ఉత్తమ్ కుమార్ రెడ్డి, రేవంత్ రెడ్డి, పార్టీ విషయంలో అలాగే నాగార్జున సాగర్ ఉప ఎన్నికల సందర్భంగా చేసిన కామెంట్స్‌ను కూడా ఠాగూర్ పరిశీలిస్తున్నారు. తాజాగా సోనియా గాంధీ విషయంలో చట్టం తన పని తాను చేసుకుపోతుందని.. పార్టీ మారడం చారిత్రాత్మక అవసరం అంటూ కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి చేసిన కామెంట్స్ విషయంలో కాంగ్రెస్ అధిష్టానం సీరియస్‌గా ఉన్నట్లు సమాచారం.

# మంకీపాక్స్ గాలి ద్వారా సోకదు

(మొదటి పేజి తరువాయి) హైదరాబాద్ ఫీవర్ అస్పత్రికి తరలించి బాధితుడిని ఐసోలేషన్‌లో ఉంచి ట్రీట్ మెంట్ చేస్తున్నామని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శంకర్ తెలిపారు. మంగళవారం సాయంత్రం పేషెంట్ రిపోర్ట్స్ వస్తాయన్నారు. మంకీపాక్స్ లక్షణాలు ఉన్న వ్యక్తితో నేరుగా ఆరుగురు కుటుంబ సభ్యులతో కాంటాక్ట్ అయినట్టు గుర్తించామన్నారు. అయితే ప్రైమరీ కాంటాక్ట్ కు సింప్టమ్స్ లేవని తేల్చిచెప్పారు. ముందు జాగ్రత్తగా వారిని కూడా ఐసోలేషన్ లో ఉంచామన్నారు. మంకీపాక్స్ ప్రాణాంతకం కాదని..ఎవరూ ఆందోళన చెందొద్దని చెప్పారు. ఈ వైరస్ గాల్లో వ్యాప్తి చెందదని..విదేశాల నుంచి వచ్చిన వాళ్లకు జ్వరం వస్తే ఐసోలేషన్ ఉంచాలని సూచించారు. మంకీ పాక్స్ సోకిన వ్యక్తికి 6 నుంచి 13 రోజుల తర్వాతనే లక్షణాలు బయటపడతాయన్నారు. మంకీపాక్స్ కు ప్రత్యేక ట్రీట్ మెంట్ లేదన్నారు. పోచమ్మ తల్లిలాగే ఈ వ్యాధి దానంతట అదే పోతుందన్నారు. మంకీపాక్స్ గాలి ద్వారా సోకదని.. ప్రజలు ఎక్కువగా భయపడాల్సిన పని లేదని డాక్టర్ శంకర్ పేర్కొన్నారు. వైరస్ లక్షణాలతో ఆసుపత్రిలో చేరిన రోగి పరిస్థితి ప్రస్తుతం నిలకడగానే ఉందన్నారు. బాధితుడి నుంచి శాంపిల్స్ సేకరించి పుణెలోని ఎన్ ఐవీకి పంపామని.. మంగళవారం యంత్రానికి రిపోర్ట్స్ వచ్చే అవకాశం ఉందని వెల్లడించారు. చేతులు, కాళ్లు, ఛాతీపై దద్దుర్లు ఉన్నాయని.. నీరసం, కాస్త జ్వరం ఉందని తెలిపారు. అతని శరీరంపై ఉన్న దద్దుర్లు మంకీపాక్స్‌లాగే ఉన్నాయన్న ఆయన.. వైరస్ నిర్ధారణ కోసం రోగి నుంచి 5 రకాల శాంపిల్స్ సేకరించినట్లు వివరించారు. వాటిని పుణెలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీ ల్యాబ్‌కు పంపనున్నట్లు చెప్పారు. రేపు సాయంత్రానికి బాధితుడి వైద్య పరీక్షల ఫలితాలు వచ్చే అవకాశం ఉందన్నారు. రోగికి అతి దగ్గరగా ఉన్న వారికి, రోగి పెద్దగా దగ్గినప్పుడు వచ్చే తుంపర్ల ద్వారా మాత్రమే వ్యాధి సోకే అవకాశం ఉందన్నారు. గాలి ద్వారా మంకీపాక్స్ సోకే అవకాశం లేదని స్పష్టం చేశారు. విదేశాల నుంచి వచ్చిన వారి శరీరంపై దద్దుర్లు, జ్వరం వంటి లక్షణాలు ఉంటే వెంటనే వైద్యులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. కామారెడ్డి జిల్లా ఇందిరానగర్ కాలనీకి చెందిన 40 ఏళ్ల వ్యక్తికి మంకీ పాక్స్ లక్షణాలున్నట్లు బయటపడింది. ఈ నెల 6న అతడు కువైట్ నుంచి కామారెడ్డి వచ్చారు. 20న జ్వరం వచ్చింది. 23 నాటికి ఒళ్లంతా రాషెస్ రావడంతో మరుసటి రోజు కామారెడ్డిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లారు. అక్కడి వైద్యులు మంకీపాక్స్ లక్షణాలున్నట్టు గుర్తించడంతో అక్కడి నుంచి 108 అంబులెన్స్‌లో ఆదివారం సాయంత్రం హైదరాబాద్‌లోని నల్లకుంట ఫీవర్ ఆసుపత్రికి తరలించారు. రోగితో కాంటాక్ట్ అయిన ఆరుగురిని గుర్తించి వారినీ ఐసోలేషన్ చేశారు.

# ప్రభుత్వంతో గవర్నర్ తమిళసై మరోమారు విమర్శలు

(మొదటి పేజి తరువాయి) కారణం అన్న సీఎం కేసీఆర్ వ్యాఖ్యలపై తాను బరెస్ట్ కానని, వరదల వల్ల నష్టపోయిన తెలంగాణకు కేంద్ర ప్రభుత్వం సాయం చేస్తూనే ఉందన్నారు. వరదలవల్ల కలిగిన నష్టంపై కేంద్రానికి ఇప్పటికే నివేదిక పంపించానన్నారు. ఇటీవల ప్రధాని హైదరాబాదు పర్యటనలో రాజకీయాలపై చర్చించారా అన్న మీడియా ప్రశ్నకు తాను స్పందించనని గవర్నర్ తమిళి సై సమాధానం ఇచ్చారు. రాష్ట్రంలో వరదలపై రాజకీయం చేయడం మంచిది కాదు. కేంద్రం నుంచి రావాల్సిన నిధులు తెలంగాణకు వచ్చాయి. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి నిధులకు సంబంధించిన వివరాలు ఇచ్చారు. నేను ఎప్పుడూ ప్రజలతోనే ఉంటాను. నైతిక బాధ్యతతోనే వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించాను. ఈ క్రమంలోనే వరద నష్టంపై కేంద్ర ప్రభుత్వానికి నివేదించాను. కింది స్థాయి నుంచి వచ్చిన మహిళ.. దేశానికి రాష్ట్రపతి కావడం కేవలం భారత్‌లోనే సాధ్యమైంది. మహిళా రాష్ట్రపతి కింద మహిళా గవర్నర్‌గా పని చేయడం సంతోషంగా ఉందన్నారు.సీఎం కేసీఆర్ ముందస్తు ఎన్నికలకు వెళ్లే అవకాశం లేదు. రాజ్‌భవన్‌లో సీఎం కేసీఆర్ కలిసిన తర్వాత కూడా ప్రొటోకాల్‌లో మార్పులేదు. వరదల సమయంలో కలెక్టర్ కూడా రాలేదు. మా మధ్య సంబంధాల్లో 'స్టేటస్ కో'నే ఉంది. ఇతర రాష్ట్రాల గవర్నర్లతో నేను పోల్చుకోను. గవర్నర్‌ను కాబట్టి రాజ్‌భవన్‌కే పరిమితం కాను. ప్రజలకు అందుబాటులో ఉండటమే నా లక్ష్యం. నాకు తోచిన రీతిలో వారికి సాయం అందిస్తానని స్పష్టం చేశారు. కాగా, తెలంగాణ గవర్నర్ హోదాలో రాష్ట్రపతి ప్రమాణ స్వీకారానికి తమిళిసై హాజరయ్యారు. :రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు తెలంగాణ గవర్నర్ తమిళిసై సౌందర్ రాజన్ శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రపతి ప్రమాణస్వీకారోత్సవానికి గవర్నర్ హాజరయ్యారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ... రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రమాణ స్వీకారానికి హాజరుకావడం సంతోషంగా ఉందన్నారు. చాలా కింది స్థాయి నుంచి వచ్చారని... చాలా సింపుల్ పర్సన్ అని..ఇది మహిళలకు దక్కిన గౌరవంగా చెప్పుకొచ్చారు. మహిళలకు ఒక రోల్ మోడల్ ద్రౌపది ముర్ము అని తెలిపారు. రాజకీయాలు మాట్లాడను...కాగా... గవర్నర్ భవన్‌కు, ప్రగతి భవన్‌కు మధ్య గ్యాప్‌పై స్పందించేందుకు గవర్నర్ నిరాకరించారు. నన్ను రాష్ట్రప్రతి ద్రౌపది ముర్ము ప్రమాణ స్వీకారానికి పిలిచారు వచ్చాను. నేను రాజకీయాలు మాట్లాడాను అంటూ గవర్నర్ తమిళిసై మీడియాకు తెలిపారు. భద్రాచలం ఏరియాలో పర్యటనపై గవర్నర్ ఏమన్నారంటే...వర్షాలు వచ్చాయి కాబట్టి వరద ప్రాంతాల్లో తిరిగానని గవర్నర్ అన్నారు. నేను రాష్ట్రానికి ప్రథమ పౌరాలను కాబట్టి ప్రజల దగ్గరికి వెళ్ళాను. వర్షాలలో ఎక్కువగా నష్టపోయిన ప్రాంతాలు ఆదివాసీలో ఉన్న ప్రాంతాలు కాబట్టి భద్రాచలం ఏరియాలో తిరిగాను. మోరల్ సపోర్ట్ ఇవ్వడానికి నేను ప్రజల దగ్గరకు వెళ్ళాను. నేను తెలుగు ప్రజల కోసం పనిచేస్తున్నా. వర్షాలపై రిపోర్టుని కేంద్రం హోంశాఖ మంత్రి ఇచ్చాను... వాళ్లు కేంద్ర బృందాలను పంపించారు. కేంద్ర ప్రభుత్వం తప్పకుండా రాష్ట్రానికి సహాయం చేస్తుంది.. గతంలో వరదలు వచ్చినప్పుడు కేంద్ర ప్రభుత్వం సహాయం చేసింది. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి వర్షాల వల్ల ఎంత నష్టం జరిగిందో కేంద్రానికి ఇచ్చారు.

# బిజెపిఆదేశిస్తే కెసిఆర్‌పై పోటీ: ఈటెల



(మొదటి పేజి తరువాయి) వ్యక్తం చేశారు. టీఆర్ఎస్ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు కేసీఆర్‌తో ఇష్టంలేని కాపురం చేస్తున్నారని, ఎన్నికలకు ఇంకా సమయం ఉంది కాబట్టి.. నియోజకవర్గాల్లో పనుల కోసమే టీఆర్ఎస్‌లో కొనసాగుతున్నారని, తెలంగాణలో రాబోయేది బీజేపీ ప్రభుత్వమేనని ఎమ్మెల్యే ఈటల రాజేందర్ వ్యాఖ్యానించారు.

# రాష్ట్రపతి భవన్ వీడిన కోవింద్ దంపతులు

## జన్‌పథ్ రోడ్డులోని ప్రత్యేక నివాసానికి చేరిక

**న్యూఢిల్లీ, జూలై 25 (సమ సమాజం):** మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ దంపతులు రాష్ట్రపతి భవన్‌ను వీడారు. ఢిల్లీ జన్‌పథ్ రోడ్డులోని తన కొత్త నివాసానికి కోవింద్ తన కుటుంబ సమేతంగా వెళ్లారు. మాజీ రాష్ట్రపతులకు ప్రభుత్వం ప్రత్యేక వసతులు కల్పిస్తుంది. వారికి ఉచిత నివాసంతో పాటు, అలవెన్సులు ఇస్తారు. ఈ క్రమంలో కోవింద్‌కు, అంతకు ముందు ప్రణబ్ ముఖర్జీకి కూడా ప్రత్యే నివాలసాలను అందుబాటులోకి తెచ్చారు.ఇదిలావుంటే మాజీ రాష్ట్రపతి రామ్ నాథ్ కోవింద్‌పై జమ్ముకశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి, పీడీపీ చీఫ్ మెహబూబా ముఫ్తీ ఆగ్రహం వ్యక్తం చేశారు. రామ్ నాథ్ కోవింద్ దేశ రాజ్యాంగాన్ని పణంగా పెట్టి బీజేపీ రాజకీయ అజెండాను అమలు చేశారంటూ ఆరోపించారు. రామ్ నాథ్ హయాంలో దేశ రాజ్యాంగం పలుసార్లు ఉల్లంఘనకు గురైందన్నారు. ఆర్టికల్ 370 రద్దు, సీఏఏ బిల్లును ప్రస్తావిస్తూ రామ్ నాథ్ కోవింద్ పై విమర్శలు చేశారు. మైనార్టీలు, దళితులపై దాడుల అంశాలను మెహబూబా ముఫ్తీ తన ట్వీట్‌లో ప్రస్తావించారు. భారతదేశ 15వ రాష్ట్రపతిగా ద్రౌపది ముర్ము ఉదయం ప్రమాణస్వీకారం చేశారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ.. కొత్త రాష్ట్రపతి ముర్ము చేత ప్రమాణం చేయించారు. ఈ



కార్యక్రమంలో మాజీ రాష్ట్రపతి రామ్ నాథ్ కోవింద్, ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు, ప్రధాని నరేంద్ర మోడీ, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, పలు రాష్ట్రాల గవర్నర్లు, పలువురు కేంద్ర మంత్రులతో పాటు ముఖ్యమంత్రులు కూడా పాల్గొన్నారు. ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము త్రివిధ దళాల గౌరవ వందనం స్వీకరించారు.

# స్వీట్లు తినిపించినప్పుడు పోలవరం గుర్తుకురాలేదా

- కాళేశ్వరం కట్టాకనే వరదముంపు పెరిగింది
- కడెం గేట్లను మార్చకపోవడం వల్లనే ముప్పు
- కెసిఆర్‌పై మండిపడ్డ వైఎస్ షర్మిల
- పిసిసి మాజీ చీఫ్ డిఎస్‌తో భేటీ

**హైదరాబాద్, జూలై 25 (సమ సమాజం):** పక్క రాష్ట్ర సీఎంను ఇంటికి పిలిచి స్వీట్లు తినిపించినప్పుడు పోలవరం వల్ల ఇబ్బంది అవుతుందని కేసీఆర్ ఎందుకు అనలేదని వైఎస్సార్టీపీ అధినేత్రి షర్మిల ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ... కాళేశ్వరం ప్రాజెక్ట్ కట్టిన తర్వాతే వరద ఎక్కువ వచ్చిందని... అసలు కాళేశ్వరం ప్రాజెక్ట్ కట్టి ఏం సాధించారని ప్రశ్నించారు. కాళేశ్వరం లోపాల బాధ్యత ఎవరు తీసుకుంటారని నిలదీశారు. కలర్ ఫోటోలకు, టూరిజం స్పాట్‌గా మాత్రమే కాళేశ్వరం పనికొచ్చిం దని విమర్శించారు. కడెం ప్రాజెక్టు గేట్లు మార్చాలన్న డిమాండ్లను కేసీఆర్ పట్టించుకోలేదన్నారు. ప్రాజెక్టు గేట్లు పనిచేయకపోవడం వల్లే ఇంత పెద్ద వరద వచ్చిందన్నారు. 33 మంది సిబ్బంది ఉండాల్సిన కడెం ప్రాజెక్టు దగ్గర ముగ్గురే ఉన్నారని తెలిపారు. బాధితుల డిమాండ్ మేరకు కరకట్ట నిర్మించాలని డిమాండ్ చేశారు. వరదల్లో గూడు కోల్పోయినవారికి డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్లు కట్టివ్వాలని షర్మిల అన్నారు. ఇదిలా వుంటే వైఎస్‌రాజశేఖర రెడ్డి ప్రభుత్వంలో మంత్రిగా పని చేసిన మాజీ పీసీసీ చీఫ్, రాజ్యసభ మాజీ ఎంపీ డి. శ్రీనివాస్ ను వైఎస్ఆర్‌టీపీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఆయన నివాసంలో సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన్ను ఆమె పరామర్శించి, ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. దాంతో వైఎస్ రాజశేఖర్ రెడ్డితో ఉన్న పాత అనుభవాలను ఆయన గుర్తు చేసుకున్నారు. ఇద్దరి మధ్య కాసేపు ఆసక్తికరమైన చర్చ జరిగింది. ఇప్పటికీ కూడా తెలంగాణ ప్రజల్లో వైఎస్సార్ పై అభిమానం చెక్కు చెదరకుండా ఉందని ఆయన అన్నారు. వారి ఆశీస్సులు ఎప్పుడూ కూడా ఆయన బిడ్డ అయిన షర్మిల మీద ఉంటుందని అన్నారు. ప్రస్తుతం ప్రజల్లో స్పందన బ్రహ్మాండంగా ఉంటుందన్నారు. రాజశేఖర్ కూతురుగానే కాకుండా వైఎస్ షర్మిలను ఒక ఐరన్ లేడిగా ఆయన పేర్కొన్నారు. ఒంటరిగా ఒక మహిళ చేస్తున్న పోరాటం గురించి ఆయన కొనియాడారు. నాకున్న రాజకీయ అనుభవంతో చెప్తున్న కచ్చితంగా షర్మిల ముఖ్యమంత్రి అవుతారని ఆయన పేర్కొన్నారు. అప్పట్లోనే వైఎస్సాఆర్ ముఖ్యమంత్రి అవుతారని నేను చెప్పానని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేసుకున్నారు.

# జిఎస్టీ,ధరలపై సభలో కాంగ్రెస్ ఆందోళన

- ప్లకార్డులతో నిరసలను వ్యక్తం చేసిన సభ్యులు
- వాయిదా తీర్మానాలపై చర్చకు పట్టు
- సభాకార్యక్రమాలకు అంతరాయం కలుగుతోందన్న స్పీకర్
- సెషన్ మొత్తానికి నలుగురు కాంగ్రెస్ ఎంపిల సస్పెన్షన్
- గాంధీ విగ్రహం ముందు నిరసనకు దిగిన కాంగ్రెస్ ఎంపిలు

**న్యూఢిల్లీ, జూలై 25 (సమ సమాజం):** లోక్‌సభ నుంచి నలుగురు కాంగ్రెస్ ఎంపీలను బహిష్కరిస్తూ లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా నిర్ణయం తీసుకున్నారు. సభలో అనుచితంగా ప్రవర్తిస్తూ సభా కార్యకలాపాలకు ఆటంకం కలిగిస్తున్నారనే కారణంగా కాంగ్రెస్ ఎంపీలను సస్పెండ్ చేస్తున్నట్లు స్పీకర్ ప్రకటించారు. మాణికమ్ ఠాకూర్, టీఎన్ ప్రతాపన్, జోతిమణి, రమ్య హరిదాస్‌ను ఈ లోక్‌సభ సమావేశాలు ముగిసే వరకూ సస్పెండ్ చేస్తున్నట్లు స్పీకర్ ప్రకటించారు. విపక్షం కోరుకున్న అంశంపై చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నప్పటికీ విపక్ష సభ్యులు నిరసన తెలిపారని స్పీకర్ ఓం బిర్లా చెప్పుకొచ్చారు. ఉభయ సభల్లో విపక్ష సభ్యులు నిరసనకు దిగడంతో సమావేశాలు వాయిదా పడిన పరిస్థితి నెలకొంది. ధరల పెరుగుదల, ద్రవ్యోల్బణంపై చర్చకు సోమవారం నాటి పార్లమెంట్ సమావేశాల్లో విపక్షాలు పట్టుబట్టాయి. సస్పెండ్ అయిన కాంగ్రెస్ ఎంపీల్లో ఒకరైన లోక్‌సభ ఎంపీ మాణికమ్ ఠాకూర్ మాట్లాడుతూ.. జీఎస్టీ, ధరల పెరుగుదల వంటి ప్రజా సమస్యలపై కేంద్రం దృష్టి సారించే విధంగా విపక్షాలు ప్రయత్నం చేస్తుంటే.. ప్రభుత్వం మాత్రం విపక్షాలతో అహంకారపూరితంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ప్రతిరోజు పార్లమెంట్ నిబంధనలకు అనుగుణంగానే తాము నడుచుకుంటున్నామని.. తాము వాయిదా తీర్మానాలను ఇస్తున్నామని చెప్పారు. ఇవాళ కూడా వాయిదా తీర్మానాన్ని ఇచ్చామని.. అయితే ప్రభుత్వం మాత్రం అదేమీ పట్టించుకోకుండా విపక్షాల గొంతు నొక్కేందుకు ప్రయత్నిస్తుందని ఆయన ఆరోపించారు. గ్యాస్ సిలిండర్ ధరల పెంపు, మైదా, మజ్జిగ, పెరుగు వంటి వస్తువులపై జీఎస్టీ విధించడంపై కాంగ్రెస్ ఎంపీలు లోక్ సభలో ప్లకార్డులతో నిరసన తెలియజేశారు. ఈ అంశాలపై చర్చ జరగాలని డిమాండ్ చేస్తూ వాయిదా తీర్మానం ఇచ్చారు. ధరల పెరుగుదలపై లోక్ సభలో కాంగ్రెస్ ఎంపీలు ప్లకార్డులతో నిరసనలు చేపట్టారు. అయితే.. నిరసన తెలియ జేయాలనుకుంటే సభ బయట ప్లకార్డులు ప్రదర్శించాలని, సభలో ప్రదర్శించకూడదని స్పీకర్ ఓం బిర్లా సూచించారు. మధ్యాహ్నం 3 గంటల తర్వాత చర్చకు సిద్ధంగా ఉన్నామని, తమ ఓపికను బలహీనతగా భావించవద్దంటూ హెచ్చరించారు. అంతకుముందు సభ వాయిదా పడిన తర్వాత మరోసారి సభలోకి ప్లకార్డులతో వచ్చి నిరసన తెలియజేశారు. దీంతో సభకు పదేపదే ఆటంకం కలుగుతుండడంతో పార్లమెంటరీ వ్యవహారాలశాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి విపక్ష ఎంపీల తీరును ఖండించారు. సభలోకి ప్లకార్డులు తీసుకొచ్చిన కాంగ్రెస్ కు చెందిన నలుగురు ఎంపీలపై చర్యలు తీసుకోవాలని స్పీకర్ ఓం బిర్లాను కోరారు. దీంతో నలుగురిని స్పీకర్ సస్పెండ్ చేశారు. ఆగస్టు 12వ తేదీన వర్షాకాల సమావేశాలు ముగియనున్నాయి. అప్పటి వరకూ నలుగురు ఎంపీలపై వేటు పడినట్లే. సస్పెన్షన్ కు గురైన అనంతరం నలుగురు ఎంపీలు పార్లమెంటు మైదానంలోని మహాత్మాగాంధీ విగ్రహం దగ్గరకు వెళ్లి నినాదాలు చేశారు. కేంద్రంపై నిప్పులు చెరిగారు. తమ ఎంపీల్లో కొందరిని సస్పెండ్ చేయడం ద్వారా కేంద్ర ప్రభుత్వం బెదిరింపులకు పాల్పడుతోందని కాంగ్రెస్ మండిపడింది. ప్రజలకు సంబంధించిన అంశాలను పార్లమెంటులో ప్రశ్నిస్తుంటే కేంద్రం తమ సభ్యుల గొంతు నొక్కేస్తోందని ఆరోపించింది.

# రాష్ట్రపతి అంటే రబ్బర్ స్టాంప్

## ఇందిర హయాం నుంచే బలపడ్డ నానుడి

**న్యూఢిల్లీ, జూలై 25 (సమ సమాజం):** 'రాష్ట్రపతి – రబ్బర్ స్టాంప్' అయ్యారన్న అపవాదు దివంగత ప్రధాని ఇందిర హయాం నుంచే ప్రచారం అయ్యింది. ఆమె సూచనమేరకు ఆనాటి రాష్ట్రపతి ఫక్రుద్దీన్ అహ్మద్ ఎమర్జెన్సీ విధించారు. అలాగే రాష్ట్రపతుల ఇందిరకు వ్యతిరేకంగా అనేక నిర్ణయాలను తీసుకునే వారు కాదు. ఆమె ఏదీ చెప్పినా చేశేవారు. దీంతో ఆనాటి నుంచి రాష్ట్రపతి రబ్బర్ స్టాంప్ అంటే చెప్పిందిచేయడం అన్నమాట రూఢి అయ్యింది. రాష్ట్రపతి పదవి రబ్బర్‌స్టాంప్ వంటిదన్న పేరు చిరకాలంగా ఉంది. కేంద్ర ప్రభుత్వ నిర్ణయాలకు ఆమోదముద్ర వేయడం తప్ప ప్రత్యేక అధికారాలు ఏమీ లేవన్న ఉద్దేశంతో ఇలాంటి అభిప్రాయం ఏర్పడింది. రాష్ట్రపతులుగా బాబూ రాజేంద్ర ప్రసాద్, సర్వేపల్లి రాధాకృష్ణన్, జాకీర్ హుసేన్, వి.వి.గిరి హయాముల్లో ఇలాంటి వాదన వినిపించలేదు. అనంతరం ఫక్రుద్దీన్ అలీ అహ్మద్ హయాంలో ఈ పేరు ప్రాచుర్యంలోకి వచ్చింది. అప్పట్లో ఇందిరాగాంధీ ప్రభుత్వం వివిధ అంశాలకు సంబంధించి తరచూ ఆర్డినెన్స్‌లను జారీ చేసేది. విధి నిర్వహణలో భాగంగా వాటిని రాష్ట్రపతి ఆమోదించేవారు. 1975 జూన్‌లో నాటి ఇందిరాగాంధీ ప్రభుత్వం దేశంలో అత్యయిక పరిస్థితిని విధించింది. ఈ నిర్ణయానికి ఆమోదం కోసం ఆమెతో పాటు, నాటి న్యాయశాఖ మంత్రి సిద్దార్థ శంకర్ రే రాష్ట్రపతి ఫకృద్దీన్ అలీ అహ్మద్‌ను కలిశారు. దేశ భవితవ్యాన్ని ప్రమాదంలోకి నెట్టే ఇలాంటి కీలక అంశాలపై రాష్ట్రపతి ఆచితూచి వ్యవహరించాలి. అనేక కోణాల్లో విస్తృతంగా ఆలోచించాలి. న్యాయ నిపుణుల సలహా తీసుకోవాలి. తనకు గల సందేహాలపై ప్రభుత్వం నుంచి వివరణ తీసుకోవాలి. గతంలో న్యాయవాదిగా, అస్సాం ప్రభుత్వంలో అడ్వకేట్ జనరల్ (ఏజీ)గా కూడా పనిచేసిన ఆయన ఈ విషయాల గురించి ఏమీ ఆలోచించలేదు. ఇందిరాగాంధీ పట్ల ఉన్న విధేయతతో అత్యయిక పరిస్థితి ప్రకటనపై సంతకం చేశారు. ఆ తర్వాత ఈ నిర్ణయం దేశాన్ని కుదిపేసింది. అప్పటి నుంచి రాష్ట్రపతి రబ్బర్‌స్టాంప్ అన్న అభిప్రాయం బలపడిపోయింది.

# 69 వేల కోట్ల నుంచి 3.12 లక్షల కోట్లకు అప్పులు

## తెలంగాణలో అప్పులే తప్ప అభివృద్ధి శూన్యం, మండిపడ్డ కాంగ్రెస్ ఎంపి ఉత్తమ్

**న్యూఢిల్లీ, జూలై 25 (సమ సమాజం):** తెలంగాణను కేసీఆర్ అప్పుల రాష్ట్రంగా మర్చారని కాంగ్రెస్ ఎంపీ ఉత్తమ్ కుమార్ రెడ్డి విమర్శించారు. ఆర్బీఐ నివేదిక ప్రకారం 2014 లో తెలంగాణ అప్పు రూ. 69 వేల కోట్లు ఉంటే..2022 నాటికి రూ.3 లక్షల12 వేల కోట్లకు చేరిందన్నారు. 2014లో ప్రతి మనిషి మీద 18 వేల అప్పు ఉంటే..2022 వచ్చే సరికి ప్రతి మనిషి తలసరి అప్పు లక్ష రపాయలు ఉందన్నారు. కట్టిన ప్రాజెక్టులు కనపడటం లేదు కానీ అప్పులు పెరుగుతున్నాయన్నారు. కార్పొరేషన్ ద్వారా తీసుకునే అప్పులను రాష్ట్ర ప్రభుత్వ అప్పులుగా గుర్తిస్తామని కేంద్రం స్పష్టం చేసిందని చెప్పారు. పెద్ద రాష్ట్రాలైన మధ్యప్రదేశ్ తో సమానంగా తెలంగాణ అప్పులున్నాయని తెలిపారు. జీతాలు ఇవ్వలేని స్థితిలో తెలంగాణ ఆర్థిక పరిస్థితి ఉందన్నారు. టీఆర్ఎస్ ప్రభుత్వం అప్పులతో రాష్ట్రాన్ని అస్తవ్యస్తం చేస్తుందని విమర్శించారు. రాష్ట్రంలో ఒక్క పథకం కూడా సరిగ్గా అమలు కావట్లేదన్నారు. మహిళల పథకాలు, ఫీజు రీయింబర్స్మెంట్ కి సంబంధించిన డబ్బులు విడుదల చేయట్లేదని విమర్శించారు. శ్రీలంక పరిస్థితులు భారత్ లో రాకూడదని విదేశాంగ మంత్రి హెచ్చరించారన్నారు. ఇష్టానుసారంగా అప్పులు చేయడం దేశానికి మంచిది కాదన్నారు.

# మోడీ హయాంలో రాజ్యాంగంపై దాడి

## సిపిఎం సభలో సీతారాం ఏచూరి ఆరోపణ






**హన్మకొండ, జూలై 25 (సమ సమాజం):** విదేశాల్లో గాంధీ పేరుతో, దేశంలో గాడ్సే పేరుతో రాజకీయాలు చేస్తున్నారని సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మండిపడ్డారు. హన్మకొండలో ప్రారంభమైన సీపీఎం రాష్ట్ర కమిటీ సమావేశాల్లో సీతారాం ఏచూరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... దేశంలో మతోన్మాదం పెరిగిపోతోందన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చరిత్రను వక్రీకరించి... బలపడాలని చూస్తోందని ఆరోపించారు. బీజేపీ పాలనలో దేశంలో ఆర్థిక సంక్షోభంలో కూరుకు పోయిందన్న ఆయన... 62 శాతం యువతకు ఉద్యోగాలు లేకుండా పోయాయని మండిపడ్డారు. పెట్టుబడిదారులకు మాత్రమే మోడీ ప్రభుత్వంలో మేలు జరిగింది తప్ప మామూలు ప్రజలకు ఒరిగిందేమీలేదని మండిపడ్డారు. దేశ ప్రజలపై ఆర్థిక దాడి జరుగుతోందన్న ఏచూరి... కోట్ల మందికి బతకుదెరువు లేకుండా పోతోందని ఆరోపించారు. 75 ఏళ్ళుగా రాజ్యాంగంపై దాడులు జరుగుతు న్నాయని, మోడీ పాలనలో రాజ్యాంగానికి ప్రమాదం పొంచి ఉందని చెప్పారు. కేంద్ర ప్రభుత్వ పనితీరును ప్రశ్నిస్తున్న ప్రతి పక్షాలపై మోడీ ప్రభుత్వం కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందన్న ఆయన... ఈ క్రమంలోనే ఈడీ, సీబీఐ వంటి దర్యాప్తు సంస్థలను ప్రయోగిస్తూ ప్రతి పక్షాలను బ్లాక్ మెయిల్ చేస్తున్నారని విరుచుకుపడ్డారు. రానున్న రోజుల్లో వామపక్షాలను బలోపేతం చేసి... కేంద్రంపై పోరాటాన్ని ఉదృతం చేస్తామని స్పష్టం చేశారు.

# సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

(మొదటి పేజీ తరువాయి) ఉందని, ఈ నేపథ్యంలో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్ రావు సూచించారు. సోమవారం బీఆర్‌కేఆర్ భవన్‌లో మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, ఎర్రబల్లి దయాకర్ రావు, సత్యవతి రాథోడ్, కొప్పుల ఈశ్వర్, గంగుల కమలాకర్, సిఎంస సోమేశ్ కుమార్‌లతో కలసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రతి ఐదేళ్లకోసారి డెంగ్యూ వ్యాధి విజృంభించే అవకాశం ఉందన్నారు. వరుసగా కురుస్తున్న భారీ వర్షాలు, వాతావరణంలో వచ్చే మార్పుల వల్ల డెంగ్యూతో పాటు మలేరియా, టైఫాయిడ్ కేసులు పెరుగుతున్నాయని తెలిపారు. ముఖ్యంగా భద్రాద్రి, ములుగు జిల్లాల్లో మలేరియా కేసులు రోజురోజుకూ పెరుగుతున్నాయన్న మంత్రి... వాటి కట్టడికి తగిన చర్యలు తీసుకుంటున్నట్లు స్పష్టం చేశారు. ఐదేండ్ల క్రితం వర్షాలు తగ్గిన తర్వాత డెంగ్యూ వ్యాధి విజృంభించిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రస్తుతం ములుగు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో మలేరియా వ్యాధి ప్రబలుతుందని తెలిపారు. మలేరియా, డెంగ్యూ కేసులు పెరగకుండా నివారణ చర్యలు తీసుకుంటున్నామని, అన్ని జిల్లాల్లో కిట్స్ అందుబాటులో ఉంచామని స్పష్టం చేశారు. ప్రతి ఆదివారం హెల్త్ టీమ్ చర్యలు తీసుకోవాలని నిర్ణయించామని చెప్పారు. నిల్వ ఉన్న నీటి ద్వారా డెంగ్యూ వ్యాప్తి చెందుతుందన్నారు. పల్లె ప్రగతి, పట్టణ ప్రగతి కార్యక్రమం ద్వారా ఈ సీజనల్ వ్యాధులు చాలా వరకు తగ్గాయన్నారు. మిషన్ భగీరథ పథకం ద్వారా సురక్షిత మంచినీటి సరఫరాతో చాలా వరకు అంటూ వ్యాధులు, సీజనల్ వ్యాధులు కూడా చాలా తగ్గాయని స్పష్టం చేశారు. ప్రజలందరూ తమ తమ ఇండ్లను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. వ్యాధులు రాకుండా ఉండేందుకు ప్రభుత్వనికి సహకరించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో, హాస్టల్స్‌లో మధ్యాహ్న భోజనం క్వాలిటీ ఉండేలా చూసుకోవాలని అన్ని జిల్లాల కలెక్టర్లకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామని హరీశ్‌రావు తెలిపారు. ఫుడ్ సేఫ్టీ అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీలు చేయాలని ఆదేశించినట్లు పేర్కొన్నారు. బూస్టర్ డోస్ వేసుకోవాలని ప్రజలందరికీ విజ్ఞప్తి చేస్తున్నట్లు హరీశ్‌రావు తెలిపారు. కరోనా కేసులు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండి ప్రభుత్వనికి సహకరించాలని కోరుతున్నామన్నారు. ప్రజాప్రతిధులు, అధికారులతో సమన్వయం చేసుకోవాలని సూచించినట్లు చెప్పారు. మంకీపాక్స్ వ్యాధి పట్ల ప్రభుత్వం అప్రమత్తంగా ఉందని హరీశ్‌రావు స్పష్టం చేశారు. కువైట్ నుంచి కామారెడ్డికి వచ్చిన ఇబ్రహీంకు మంకీపాక్స్ లక్షణాలు ఉన్నట్లు గుర్తించామని తెలిపారు. ప్రస్తుతం ఇబ్రహీం ఫీవర్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నారని, అతని నమూనాలను సేకరించి, పుణెలోని ఎన్ఐవీ ల్యాబ్‌కు పంపామని తెలిపారు. ఫీవర్ ఆసుపత్రిలో అన్ని రకాల సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని స్పష్టం చేశారు. డెంగ్యూ విషయంలో జాగ్రత్తగా ఉండాలన్న ఆయన... ప్రతి జిల్లాలో ప్లేట్ లెట్ ల కోసం హాస్పిటల్ ను కేటాయించామని పేర్కొన్నారు. అలాగే గ్రామాల్లో మలేరియా, డెంగ్యూ కిట్లు అందుబాటులో ఉంచామని, స్కూళ్లు, కాలేజీలు, ఇతర ప్రైవేట్ సంస్థల్లో ప్రతి శుక్రవారం 'డ్రై డే ' ఏర్పాటు చేస్తున్నామని మంత్రి వెల్లడించారు. అదేవిధంగా ఇక నుంచి క్రమం తప్పకుండా ప్రభుత్వ హాస్టళ్లలో ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీలు నిర్వహిస్తారని చెప్పారు. అలాగే ప్రతి ఆదివారం మున్సిపల్, పంచాయతీ అధికారులు ఇంటింటికి వెళ్లి ఇన్స్?పెక్షన్ చేయాలని ఆదేశించినట్లు తెలిపారు. దేశ వ్యాప్తంగా రోజురోజుకూ కరోనా కేసులు పెరుగుతున్నయన్ని మంత్రి... రాష్ట్రంలో కూడా కరోనా కేసులు పెరుగుతున్నాయని పేర్కొన్నారు. కరోనా విషయంలో అలసత్వం వద్దని, ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని కోరారు. మాస్కులు, సానిటైజర్లు కచ్చితంగా వాడాలని సూచించారు. ప్రతి ఒక్కరూ బూస్టర్ డోస్ వేయించుకోవాలని చెప్పారు. కామారెడ్డికి చెందిన వ్యక్తి కి మంకీ పాక్స్ లక్షణాలు ఉన్నట్లు గుర్తించామని చెప్పిన మంత్రి... టెస్టింగ్ కోసం శాంపిల్ ను పూణెకు పంపినట్లు తెలిపారు. ఇతర దేశాల్లో మంకీ పాక్స్ విజృంభిస్తోందన్న మంత్రి... విదేశాల నుంచి వచ్చిన వారు భయపడాల్సిన అవసరం లేదన్నారు. ఎవరికైనా మంకీ పాక్స్ లక్షణాలు ఉంటే దగ్గర్లోని ఆరోగ్య కేంద్రాలను సంప్రదించాలని కోరారు. మంకీ పాక్స్ కు సంబంధించి శాంపిల్ పరిశీలన కోసం గాంధీ హాస్పిటల్, ఫీవర్ హాస్పిటల్ కు వెళ్లాలని మంత్రి కోరారు.

# అత్యున్నత పీఠంపై ఆదివాసీ మహిళ

## రాష్ట్రపతిగా ప్రమాణాస్వీకారం చేసిన ద్రౌపది ముర్ము

(మొదటి పేజీ తరువాయి) డారు. ఈ సందర్భంగా దేశప్రజలకు ద్రౌపది ముర్ము కార్గిల్ దివస్ శుభాకాంక్షలు తెలిపారు. డిజిటల్ టెక్నాలజీ, స్టార్టప్ రంగాల్లో దేశం దూసుకెళ్తోందని ముర్ము అన్నారు. రాష్ట్రపతిగా దేశవాసులందరికీ తన సేవలు అందిస్తానన్నారు. అభివృద్ధి పనులు మరింత వేగవంతం కావాల్సి ఉందని, 'సబ్ కా ప్రయాస్ సబ్ కా కర్తవ్య' నినాదం ముందుకు వెళ్లాలన్నారు. స్వాతంత్య్ర సమరయోధుల కల సాకారం చేయాలన్నారు. ఈ సందర్భంగా దేశప్రజలకు ద్రౌపది ముర్ము కార్గిల్ దివస్ శుభాకాంక్షలు తెలిపారు. సంప్రదాయబద్ధంగా నిర్వహించే ఊరేగింపుతో ముర్ము సెంట్రల్ హాలుకు చేరుకున్నారు. జస్టిస్ ఎన్వీ రమణ.. రాజ్యాంగంలోని ఆర్టికల్–60 ప్రకారం ఆమెతో ప్రమాణం చేయించారు. ఆ వెంటనే సైన్యం 21 సార్లు గాల్లోకి కాల్పులు జరిపి నూతన రాష్ట్రపతికి గౌరవ వందనం సమర్పించింది. ప్రమాణ స్వీకారానికి ముందు ముర్ము వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. తొలుత దిల్లీలోని రాజ్‌ఘాట్‌ను సందర్శించి మహాత్మా



గాంధీకి నివాళులు అర్పించారు. అనంతరం.. రాష్ట్రపతి భవన్‌కు వెళ్లగా.. రామ్‌దనాథ్? కోవింద్‌దంపతులు ముర్ముకు అభినందనలు తెలిపారు.రాష్ట్రపతిగా తన ఎన్నిక కోట్లాది భారతీయుల విశ్వాసానికి ప్రతీక అని అన్నారు ముర్ము. ఈ గెలుపు తన ఒక్కరి ఘనత కాదని.. దేశ ప్రజలందరికీ దక్కిన విజయమని అభిప్రాయపడ్డారు. పేద ప్రజలు కలలు కని.. నిజం చేసుకోగలరనేందుకు తన ఎన్నికే నిదర్శనం అని పేర్కొన్నారు. రాష్ట్రపతిగా ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం తొలిసారి ప్రసంగించిన ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు.'దేశ ప్రజల విశ్వాసం నిలబెట్టుకునేందుకు కృషి చేస్తా. భారత్ 'ఆజాదీకా అమృత్ మహోత్సవ్' ఉత్సవాలు జరుపుకుంటోంది. ఉత్సవాల వేళ రాష్ట్రపతిగా ఎన్నిక కావడం సంతోషంగా ఉంది. 50 ఏళ్ల స్వాతంత్య వేడుకల వేళ నా రాజకీయ జీవితం ప్రారంభమైంది. 75 ఏళ్ల ఉత్సవాల వేళ రాష్ట్రపతిగా ఎన్నిక కావడం సంతోషంగా ఉంది. ఒడిశాలోని చిన్న ఆదివాసీ గ్రామం నుంచి వచ్చి.. అత్యున్నత పదవి చేపట్టడం గౌరవంగా భావిస్తున్నానని అన్నారు ద్రౌపది. ప్రసంగం తర్వాత రాష్ట్రపతి భవన్‌కు వెళ్లారు ద్రౌపదీ ముర్ము. అక్కడ రాష్ట్రపతిగా అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. ఆ సమయంలో రామ్‌నాథ్ కోవింద్ ముర్ము వెంటే ఉన్నారు. బాధ్యతలు స్వీకరించిన తర్వాత.. అధికారిక ట్విట్టర్ ఖాతాను ముర్ముకు బదిలీ చేశారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ఉన్న జస్టిస్ ఎన్వీ రమణ అరుదైన ఘనత దక్కింది. రాష్ట్రపతితో ప్రమాణ స్వీకారం చేయించిన తొలి తెలుగు వ్యక్తిగా జస్టిస్ రమణ ఖ్యాతి గడించారు. సాధారణంగా రాష్ట్రపతితో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ప్రమాణ స్వీకారం చేయిస్తారు. ప్రస్తుతం సీజేఐగా ఉన్న జస్టిస్ రమణ.. ఆ గౌరవం దక్కించుకున్నారు. ఇప్పటివరకు ఏ తెలుగు వ్యక్తి భారత రాష్ట్రపతితో ప్రమాణం చేయించలేదు. రాష్ట్రపతిగా జులై 25న ప్రమాణ స్వీకారం చేసిన 10వ వ్యక్తి ద్రౌపదీ ముర్ము. 1977లో నీలం సంజీవ రెడ్డి జులై 25న భారత ఆరో రాష్ట్రపతిగా జులై 25న ప్రమాణం చేశారు. అప్పటి నుంచి దేశ అత్యున్నత పీఠాన్ని అధిరోహించినవారంతా అదే తేదీన బాధ్యతలు చేపడుతున్నారు. ఇప్పుడు 15వ రాష్ట్రపతి ముర్ము కూడా అదే జాబితాలో చేరారు.

# పేద సిక్కులను ఆదుకుంటామన్న మంత్రి

**హైదరాబాద్, జూలై 25 (సమ సమాజం):** సిక్కుల న్యాయమైన డిమాండ్లను సానుకూల దృక్పథంతో పరిశీలిస్తామని సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. మాజీ ఐపీఎస్ ఆఫీసర్ తేజ్ దీప్ కౌర్ మీనన్ నాయకత్వంలో పలువురు సిక్కు ప్రముఖులు సచివాలయంలో సోమవారం మంత్రి కొప్పుల ఈశ్వర్ ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తెలంగాణలోని సిక్కులలో చాలా మంది పేదరికంలో ఉన్నారని, ఇతర మైనారిటీలతో పాటు తమకు కూడా ప్రభుత్వ పథకాలను అమలు చేయాలని కోరారు. రాష్ట్రంలో 44 గురుద్వారాలు ఉండగా వీటికి ఆదాయ వనరులు లేక నిర్వహణకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని వివరించారు. వీటి పూజారీలు ,రాగీస్ జీవనోపాధి భారంగా ఉన్నందున, వీరికి ప్రతి నెల 7,500 రూపాయల గౌరవ వేతనం ఇవ్వాలని వినపత్రం అందజేశారు.

# రాజ్యసభ సభ్యుడిగా ఇళయారాజా ప్రమాణం

**న్యూఢిల్లీ, జూలై 25 (సమ సమాజం):** సంగీత విద్వాంసుడు ఇళయరాజా రాజ్యసభ ఎంపీగా ప్రమాణ స్వీకారం చేశారు. ఇటీవల రాష్ట్రపతి కోటాలో రాజ్యసభకు ఆయనను కేంద్ర ప్రభుత్వం నామినేట్ చేసింది. నలభై రెండేళ్ల మ్యూజిక్ కెరీర్‌లో 1,400కు పైగా సినిమాలకు ఇళయరాజా సంగీతాన్ని సమకూర్చారు. 7 వేలకి పైగా పాటలకు సంగీతం ఇచ్చారు. 20 వేలకు పైగా కాన్సర్ట్స్ నిర్వహించారు. నాలుగుసార్లు జాతీయ అవార్డు అందుకున్నారు. 1988లో అప్పటి తమిళనాడు సీఎం కరుణానిధి.. ఇళయరాజాకి ఇసైజ్ఞాని (సంగీత జ్ఞాని) అనే బిరుదు ఇచ్చారు. కేంద్రం పద్మవిభూషణ్, పద్మభూషణ్‌తో సత్కరించింది. ఇళయరాజా మద్రాస్ ప్రెసిడెన్సీలోని పణ్ణైపురంలో 1943 సంవత్సరం జూన్ 3న పుట్టారు. 14 ఏళ్ల వయసు నుంచే తన అన్నయ్య నడిపే మ్యూజికల్ ట్రూప్‌తో కలిసి పని చేశారు. ఓ ప్రొఫెసర్ దగ్గర వెస్టర్న్ క్లాసికల్ మ్యూజిక్‌లో టెక్నిక్స్ నేర్చుకున్నారు. ఇన్‌స్ట్రుమెంటల్ పర్‌ఫార్మెన్స్ గురించి స్టడీ చేశారు. కర్నాటక సంగీతాన్ని అవపోసన పట్టారు. క్లాసికల్ గిటార్‌లో గోల్డ్ మెడల్ సాధించారు. లండన్‌లోని ట్రినిటీ కాలేజ్ ఆఫ్ మ్యూజిక్ నుంచి సంగీత దర్శకుడు జీకే వెంకటేష్ దగ్గర అసిస్టెంట్‌గా పని చేసే అవకాశం సంపాదించారు. పలు సినిమాలకు అసిస్టెంట్‌గా పని చేశాక, 1976లో 'అన్నక్కిళి' అనే సినిమాకి సోలో మ్యూజిక్ డైరెక్టర్‌గా పని చేసే చాన్స్ దొరికింది. తమిళ సినీ చరిత్రలో దీన్నో కల్ట్ క్లాసిక్‌గా చెబుతుంటారు. ఆ చిత్రానికి వర్క్ చేసిన తర్వాత ఇక వెనుదిరిగి చూసుకోలేదు




# చలన చిత్రం

## భారీరేటుకు లైగర్ చిత్ర శాటిలైట్ రైట్స్ ?

టాలీవుడ్, బాలీవుడ్ మోస్ట్ అవెయిటెట్ మూవీ 'లైగర్'.డ్యాషింగ్ డైరెక్టర్ పూరి జగన్నాథ్ దర్శకత్వంలో 'రౌడీ' హీరో విజయ్ దేవరకొండ హీరో తెరకెక్కిన ఈ చిత్రం ఆగస్టు 25న ప్రేక్షకులు ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో మూవీ ప్రమోషన్లో భాగంగా ఇటీవల రిలీజ్ చేసిన లైగర్ ట్రైలర్‌కు విశేష స్పందన వస్తోంది. డైలాగ్స్, యాక్షన్ సన్నివేశాలతో ట్రైలర్ దద్దరిల్లిపోయింది. విజయ్-పూరీ కాంబినేషన్‌తో అనగానే ఈ చిత్రంపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇక ట్రైలర్ విడుదల అనంతరరం ఈ చిత్రంపై ప్రేక్షకుల్లో మరింత హైప్ క్రియేట్ అయ్యింది. ఇక మూవీ రిలీజ్ ఎప్పుడెప్పుడా అని ప్రేక్షకులు, ఫ్యాన్స్ ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఈ క్రమంలో సినిమాకు సంబంధించి ఓ ఆసక్తికర న్యూస్ నెట్టింట చక్కర్లు కొడుతోంది. పాన్ ఇండియా చిత్రంగా తెరకెక్కిన లైగర్ క్రేజ్ దృష్ట్యా శాటిలైట్, డిజిటల్ రైట్స్ భారీ డీల్‌కు ఒప్పందం కుదిరినట్లు సమాచారం. శాటిలైట్.. డిజిటల్ రైట్స్ కలుపుకుని మొత్తం రూ. 55 నుంచి రూ. 60 కోట్లు పలికినట్టుగా సినీవర్గాల నుంచి సమాచారం. బాలీవుడ్ ప్రముఖ నిర్మాత కరణ్ జోహార్, పూరీ కనెక్ట్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రంలో బాలీవుడ్ బ్యూటీ అనన్య పాండే హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ సినిమాతో ఆమె తెలుగు ప్రేక్షకులకు పరిచయం కానుంది. ఇందులో రమ్యకృష్ణ హీరో తల్లిగా నటిస్తుండగా.. బాక్సింగ్ చాంపియన్ మైక్ టైసన్ గెస్టు రోల్‌లో అలరించబోతున్నాడు.




## కాశ్మీర్ కొండల్లో నడిచే ప్రేమ కథే సీతారామం



కాశ్మీర్ కొండల్లోని ఒంటరి సైనికుడికి.. ఓ యువతికి మధ్య నడిచే 1965 నాటి ప్రేమ కథే సీతారామం.

నాలుగు మాటలు పోగేసి లేఖ రాస్తే.. కాశ్మీర్‌ని మంచుకొదిలేసి వస్తారా? అనే సీత అందమైన మాటలు ఆకర్శిస్తాయి. సీతను వెతికే క్రమంలో రామ్ గురించి కొన్ని నిజాలు తెలుస్తాయి. మొత్తంగా సీతారామం.. ఈ ఇద్దరి అపరిచితుల మధ్య ఉత్తరాలతో ఏర్పడే ప్రేమ కథ. ఈ కథ ఎటువైపు వెళ్లింది. రష్మిక ఆ ఉత్తరాన్ని సీతకు అందజేసిందా అనేది సస్పెన్స్. దాదాపు రెండున్నర నిమిషాలున్న ట్రైలర్ ను చూస్తుంటే సీతారామం సినిమా ఓ అందమైన దృశ్య కావ్యంగా నిలవనుందని తెలుస్తోంది. హీరో దుల్ఖర్ సల్మాన్ హీరోగా నటిస్తున్న తెలుగు సినిమా 'సీతారామం'లో మృణాళ్ ఠాకూర్ కథానాయికగా నటించింది. యుద్ధంతో రాసిన ప్రేమకథ దీనికి ట్యాగ్ లైన్. స్వప్న సినిమాస్ బ్యానర్ పై, వైజయంతి మూవీస్ సమర్పణలో, హనురాఘవపూడి దర్శకత్వంలో ఈ సినిమా తెరకెక్కింది. ఆగస్ట్ 5న ఈ సినిమా థియేటర్స్ విడుదల కాబతోంది. తెలుగుతో పాటు తమిళ, మలయాళ భాషల్లోనూ చిత్రం విడుదల కానుంది. ఇంతకు ముందు విడుదలైన ఈ సినిమా టీజర్, సింగిల్స్‌కు మంచి స్పందన లభించింది. తాజాగా 'సీతారామం' మూవీ ట్రైలర్‌ను విడుదల చేశారు. ప్రస్తుతం ఈ ట్రైలర్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.20 ఏళ్ళ క్రితం లెఫ్టినెంట్ రామ్ నాకో బాధ్యత అప్పగించారు. ఈ ఉత్తరాన్ని సీతామహాలక్ష్మికి నువ్వే చేర్చాలి' అనే వాయిస్ పై ట్రైలర్ ఓపెన్ అవుతుంది. ఆ ఉత్తరం పట్టుకొని జర్నలిస్ట్ ఆఫ్రిన్ (రష్మికా) ప్రయాణం మొదలు పెడుతుంది. పదిరోజుల్లో ఆ ఉత్తరం సీతకు అప్పగించడమే తన లక్ష్యం. అయితే ఆ పేరుతో ఎవరూ లేరని తెలుస్తుంది. అయినా సరే సీతకోసం అన్వేషణ మొదలవుతుంది. 1965 నేపథ్యంలో సాగే ఈ ప్రేమకథ ఎంతో హృద్యంగా ఉండబోతోందని ట్రైలర్ ను బట్టి అర్థమవుతోంది. అలా సీతను వెతికే ప్రయత్నంలో లెఫ్టినెంట్ రామ్ గురించి కొన్ని నిజాలు తెలుస్తాయి. అదేంటో తెలియాలంటే సినిమా చూడాల్సిందే. ప్రకాష్ రాజ్, తరుణ్ భాస్కర్, మురళీ శర్మ, సుమంత్ , భూమిక ఇతర ముఖ్యపాత్రలు పోషిస్తున్న ఈ సినిమాలోని చాలా భాగం కశ్మీర్‌లో చిత్రీకరించారు. చిత్ర యూనిట్ చాలా కష్టాలు పడిందని దర్శకుడు హను చెప్పాడు.



## విక్కీ కౌశల్, కత్రినా కైఫ్ జంటకు బెదిరింపులు



బాలీవుడ్ నటులు విక్కీ కౌశల్, కత్రినా కైఫ్ జంటకు బెదిరింపులు వచ్చాయి. ఓ గుర్తు తెలియని వ్యక్తి సోషల్ మీడియా ద్వారా చంపేస్తానంటూ బెదిరించాడు. ఈ నేపథ్యంలో ముంబైలోని శాంటాక్రజ్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. ఆ కేసులో దర్యాప్తు కూడా ప్రారంభమైందని అన్నారు. ఇన్‌స్టాగ్రామ్‌లో ఆ నటులకు బెదిరింపులు వస్తున్నట్లు తేలింది. బెదిరింపునకు పాల్పడిన వ్యక్తి కత్రినా కైఫ్‌ను వెంటాడుతున్నట్లు తెలుస్తోంది. ఐటీ చట్టం ప్రకారం కేసు బుక్ చేశారు.

## మ్యాథ్స్‌పై నటి జాన్వీకపూర్ వ్యాఖ్యలు ట్రోల్ చేస్తున్న నెటిజన్లు

అందాల తార, దివంగత శ్రీదేవి ముద్దుల తనయ జాన్వీ కపూర్ మొదటి సినిమా 'ధడక్'తోనే స్టార్ హీరోయిన్‌గా మారిపోయింది. తన నటనతో, అందచందాలతో కోట్లాదిమంది మనసులు కొల్లగొట్టింది. అంతేకాకుండా యూత్‌లో యమ క్రేజ్ సంపాదించుకుంది. అలాగే సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండే జాన్వీ.. పలు కామెంట్స్‌తో ట్రోలింగ్ కూడా ఎదుర్కొంది. తాజాగా మరోసారి ట్రోలింగ్ బారిన పడింది బ్యూటిపుల్ జాన్వీ కపూర్. జాన్వీ కపూర్ నటించిన లేటేస్ట్ మూవీ 'గుడ్ లక్ జెర్రీ'. ఈ సినిమాకు సంబంధించిన ప్రమోషన్స్‌లో భాగంగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొంది. ఈ ఇంటర్వ్యూలో మాథ్స్‌పై కామెంట్స్ చేసి ట్రోలింగ్‌కు గురైంది. స్కూల్‌లో చదివేటప్పుడు నాకు చరిత్ర, లిటరేచర్ అంటే చాలా ఇష్టం. మ్యాథ్స్ అంటే అస్సలు ఇష్టం లేదు. అయినా నాకో విషయం అర్థం కాదు. అదేంటంటే.. కాలిక్యులేటర్ కనిపెట్టిన తర్వాత లెక్కలు చేయడం చాలా సులభమైంది. ఇంకా కష్టపడి ఆల్జీబ్రాను నేర్చుకోవడంలో ఉపయోగమేంటీ? గణితం కోసం ఎందుకు అంతలా తలలు బద్దలు కొట్టుకుంటారో అర్థం కాదు. అయితే చరిత్ర, సాహిత్యం ప్రజల్ని సంస్కారవంతమైన మనుషులుగా తీర్చిదిద్దుతాయి. మాథ్స్ మిమ్మల్ని నెమ్మదించేలా చేస్తుంది. అని మాట్లాడింది. ప్రస్తుతం ఈ వీడియో నెట్టింట తెగ వైరల్ అవుతోంది. ఇది చూసిన నెటిజన్లు ట్రోలింగ్‌తో జాన్వీని ఆడేసుకుంటున్నారు. 'లక్షల ఫీజు కట్టి ఇంటర్నేషనల్ స్కూళ్లలో చదివిన వారి నాలెడ్జ్ ఎలా ఉంటుదనే దానికి ఇదే ప్రూఫ్', 'మీరు ఉన్న దయనీయ స్థితికి మ్యాథ్స్‌ను ఎందుకు నిందిస్తారు', 'కాలిక్యులేటర్‌తో ఆల్జీబ్రాని చేసేందుకు జాన్వీ కపూర్ ప్రయత్నిస్తోంది. ఇక్కడే లాజిక్ చచ్చిపోయింది. ఇక ముందుకు సాగండి. ఇంకా ఇలాంటివి చాలా చూడాలి' అంటూ ట్రోల్ చేస్తున్నారు.



## స్క్రిప్టుపై మరింత దృష్టి అవసరం

లాల్‌సింగ్ చద్దా ట్రైలర్ రిలీజ్‌లో చిరు సందేశం

బాలీవుడ్ మిస్టర్ పర్‌ఫెక్ట్ అమిర్ ఖాన్, కరీనా కపూర్ జోడిగా నటించిన చిత్రం 'లాల్‌సింగ్ చద్దా'. హాలీవుడ్ మూవీ 'ఫారెస్ట్ గంప్'కు రీమేక్‌గా వస్తున్న ఈ సినిమాలో టాలీవుడ్ గుడ్ బాయ్ నాగ చైతన్య కీలక పాత్రలో నటిస్తున్నాడు. ఈ సినిమాకు అద్వైత్ చందన్ దర్శకత్వం వహించారు. చిత్రం ఆగస్టు 11న విడుదల కానుంది. అలాగే ఈ చిత్రాన్ని తెలుగులో మెగాస్టార్ చిరంజీవి సమర్పిస్తున్నారు. తాజాగా ఈ మూవీ తెలుగు ట్రైలర్ లాంచ్ ఆదివారం గ్రాండ్‌గా జరిగింది. ఈ ఈవెంట్‌లో ట్రైలర్ లాంచ్ చేసిన చిరంజీవి టాలీవుడ్ దర్శకులను ఉద్దేశించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఈ కార్యక్రమంలో అమీర్ ఖాన్ నటన గురించి ఎంతో గొప్పగా చెప్పారు. అమీర్‌లా తమకు చేయాలని ఉన్నా పలు పరిధుల వల్ల తాము చేయలేకపోతున్నామని చిరు చెప్పిన విషయం తెలిసిందే. అలాంటి పరిధుల గురించి ఈ కార్యక్రమంలో చిరంజీవి తెలిపినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే పలువురు టాలీవుడ్ డైరెక్టర్లకు చురకలు అంటించారు. 'కొందరు డైరెక్టర్లు షూటింగ్ స్పాట్‌లో అప్పటికప్పుడు డైలాగ్‌లు ఇస్తున్నారు. ఇది నటులను చాలా ఇబ్బంది పెడుతోంది. నాకు కూడా చాలా సార్లు ఇలాంటి అనుభవం ఎదురైంది. స్క్రిప్ట్ విషయంలో డైరెక్టర్లు మరింత శ్రమించాలి. స్క్రిప్ట్ గురించి మిగతా టెక్నిషియన్స్‌కు ముందుగానే తెలిస్తే వారు పనిచేసే విధానం వేరు. దానికి వచ్చే ఫలితం వేరేలా ఉంటుంది.

Edited, Printed, Published & owned by **GOSUKONDA PRUDHVIRAJU**, Published From, H.No. 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, TELANGANA,
Printed at **Panidhar PUBLICATIONS**. H.NO: 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, Editor: **GOSUKONDA PRUDHVIRAJU**,
RNI.TELTEL/2016/ 73311, Cell:8897334003 Email: samasamajamdaily@gmail.com, Website: www.samasamajam.in